S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 253 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 22, మే 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

# బహుముఖ దార్శనికుడు రాజీవ్ గాంధీ

- దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రాణాలర్పించారు
- భారత్.. ట్రంప్‌నకు లొంగిపోయి యుద్ధం విరమించుకుందనే భావన ప్రజల్లో ఉంది
- రాజీవ్ సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**మే 21, సమయం న్యూస్, హైదరాబాద్:** 'భారతదేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన బహుముఖ దార్శనికుడు రాజీవ్‌గాంధీ.. దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రాణాలర్పించిన గొప్ప నాయకుడు.. అందుకే ఆయన వర్ధంతి నాడు నివాళిగా అంతర్జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవాన్ని పాటిస్తున్నాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ''సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశానికి తీసుకువచ్చిన మార్గదర్శకుడు, ఆర్థిక సరళీకృత విధానాలను అమలు చేసిన స్ఫూర్తిదాయక నాయకుడు రాజీవ్ గాంధీయే. దేశ భవిష్యత్‌ను నిర్దేశించడంలో యువత పాత్ర కీలకమని ముందే ఊహించిన ఆయన.. ఓటు హక్కు పొందే వయసును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఆయన విగ్రహాన్ని సచివాలయం ఎదురుగా ఏర్పాటుచేస్తే సంకుచిత భావాలున్న కొందరు నాయకులు రాద్ధాంతం చేస్తున్నారు. అటు అమరవీరుల సంస్మరణ వేదిక, ఇటు ఇందిరా గాంధీ,

తరువాయి 2లో



## భారత్ బయోటెక్ కలరా టీకా హిల్‌కాల్

- నోటి ద్వారా తీసుకునే వీలు
- క్లినికల్ పరీక్షల్లో విజయవంతం
- 20 కోట్ల డోసుల ఉత్పత్తికి సన్నాహాలు


**మే 21, సమయం న్యూస్, హైదరాబాద్:** భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన కలరా టీకా 'హిల్‌కాల్' మూడో దశ క్లినికల్ పరీక్షల్లో విజయవంతమైంది. కలరా వ్యాధికి కారణమయ్యే ఒగావా,

తరువాయి 2లో




## మావోయిస్టు... దళపతి ఎన్‌కౌంటర్





2లో

- కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతి
- అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆయన సహా 27 మంది మృత్యువాత
- అగ్రనేతలు ఉన్నారన్న సమాచారంతో ఈ నెల 19 నుంచే కూంబింగ్
- అతిపెద్ద విజయమన్న ప్రధాని మోదీ


## అన్నదాతకు వానకాటు

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- పిడుగుపాటుకు నలుగురి మృతి
- వచ్చే నాలుగు రోజులూ వర్షా లు

**మే 21, సమయం న్యూస్, హైదరాబాద్, నిర్మల్, నర్సంపేట:** రాష్ట్రంలో బుధవారం పలు జిల్లాల్లో వర్షాలు, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పిడుగులు పడిన ఘటనల్లో మొత్తం నలుగురు మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లాల్లో ఇద్దరు, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో ఒక్కొక్కరు చనిపోయారు. సూర్యాపేట జిల్లా నల్లబండగూడెం వద్ద పిడుగుపాటుకు 39 మేకలు మృత్యువాత పడ్డాయి. హైదరాబాద్ నగరంతో పాటు ఆదిలాబాద్, జగిత్యాల,

తరువాయి 2లో






## పాఠశాల సిలబస్‌లో యోగాను చేరుస్తాం

- కనీవినీ ఎరుగని విధంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- నెల రోజులపాటు 'యోగాంధ్ర' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు
- రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది పాల్గొనేలా ఏర్పాట్లు
- జూన్ 21న విశాఖపట్నంలో 5 లక్షల మందితో భారీగా కార్యక్రమం

### ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

**మే 21, సమయం న్యూస్, అమరావతి:** రానున్న రోజుల్లో రాష్ట్రంలో యోగాను పాఠశాలల సిలబస్‌లో చేరుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జూన్ 21న పదకొండో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తామన్నారు. యోగాంధ్ర2025 పేరుతో బుధవారం (మే 21) నుంచి నెల రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని, జూన్ 21న విశాఖపట్నంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే కార్యక్రమాన్ని ఐదు లక్షల మందితో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సంవత్సరం యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ వన్ ఎర్త్.. వన్ హెల్త్' నినాదంతో.. ఇప్పటి వరకు నమోదైన అన్ని రికార్డులనూ బద్దలు కొడుతూ అత్యంత ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆ రోజున

తరువాయి 2లో

## కుంకీలు వచ్చేస్తున్నాయ్...



- ఏనుగులను అప్పగించిన కర్ణాటక
- బదిలీ ఆదేశ పత్రాలు అందుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

2లో

## భారత్‌కు గగనతలం మూసివేత..

- మరో నెల పొడిగించనున్న పాక్!

**మే 21, సమయం న్యూస్,** భారత్‌పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ విమానాలకు పాకిస్థాన్ తన గగనతలాన్ని మూసివేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని మరో నెలపాటు పొడిగించేందుకు దాయాది దేశం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ నిషేధానికి సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో పాక్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ (ICAO) నిబంధనల ప్రకారం.. గగనతల ఆంక్షలు ఒకేసారి ఒక నెల కంటే

తరువాయి 2లో



# మావోయిస్టు దళపతి ఎన్‌కౌంటర్..

హైదరాబాద్: భారత విప్లవోద్యమ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్ (70) ఎదురుకాల్పుల్లో హతమయ్యారు. నాలుగున్నర దశాబ్దాలకు పైగా నక్సల్స్ ఉద్యమంలో కొనసాగి చివరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపుర్ జిల్లాలోని అబూజ్‌మడ్ అడవుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అసువులు బాశారు. ఈ స్థాయి నేత ఎన్‌కౌంటర్‌లో మరణించడం ఇదే తొలిసారి. ఈ ఘటనలో మొత్తం 27 మంది మావోయిస్టులు, ఓ జవాన్ మృతి చెందారు. మావోయిస్టు పత్రిక 'అవామ్‌ఇ జంగ్' ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు సజ్జ వెంకటనాగేశ్వరరావు ఎలియాస్ నవీన్ (61), మావోయిస్టు కంపెనీ కాయ్7 కమాండర్ టిప్పు.. మృతుల్లో ఉన్నట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు ప్రకటించారు. మిగతా మృతుల వివరాలు వెల్లడికాలేదు. కేశవరావును అంతమొందించడం మావోయిస్టులపై అతిపెద్ద విజయమని ప్రధాని మోదీ ప్రకటించారు.

**విశ్వసనీయ సమాచారంతో**

నారాయణపుర్, బీజాపుర్, దంతెవాడ సరిహద్దుల్లోని అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో అగ్రనేతలతో పాటు, మాడ్ డివిజన్, పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ)కి చెందిన సీనియర్ కేడర్ ఉన్నారని నిఘావర్గాలకు కీలక సమాచారం అందడంతో గత సోమవారమే ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. నారాయణపుర్, దంతెవాడ, బీజాపుర్, కొండగావ్ జిల్లాల నుంచి డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) బలగాలు ఆ ప్రాంతంలోని అడవుల్ని జల్లెడ పడుతూ ముందుకుసాగాయి. అక్కడి భౌగోళిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ.. కేశవరావు ఉన్నారనే విశ్వసనీయ సమాచారంతో సవాళ్లను ఎదుర్కొంటూ ఆపరేషన్ కొనసాగించాయి. బుధవారం ఉదయం సమయంలో ఒర్ఛా పోలీస్ స్టేషన్ పరిధి జాట్లూరు అటవీ ప్రాంతంలో బలగాలకు మావోయిస్టులు తారసపడడంతో గంటలపాటు ఎదురు కాల్పులు కొనసాగాయి. ఎన్‌కౌంటర్‌లో ఒక డీఆర్జీ జవాన్ మృతి చెందగా.. మరికొందరికి గాయాలయ్యాయి. మావోయిస్టుల వైపు నుంచి కాల్పుల శబ్దం ఆగిన తర్వాత ఘటనాస్థలికి వెళ్లి చూడగా 27 మృతదేహాలు లభ్యమైనట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు వెల్లడించారు. ఆ ప్రాంతంలో ఏకే47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, కార్బైన్ ఆయుధాలతోపాటు పేలుడు సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్‌లో మరణించిన జవానుతో పాటు మావోయిస్టుల మృతదేహాలను నారాయణపుర్ జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ ఆపరేషన్ పెద్ద విజయంగా ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి, హోంమంత్రి విజయశర్మ అభివర్ణించారు. ఎన్‌కౌంటర్‌లో మరికొందరు మావోయిస్టు అగ్రనేతలు గాయపడి ఉంటారని.. వారి జాడ కోసం పరిసర ప్రాంత అడవుల్లో కూంబింగ్ కొనసాగుతోందని వెల్లడించారు.

*** ఆపరేషన్ బ్లాక్‌ఫారెస్ట్ ముగించిన వెంటనే..**

ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని బీజాపుర్ జిల్లా ఊసూరు పోలీసుస్టేషన్ పరిధిలోని కర్రెగుట్టల్లో కేంద్ర బలగాలు ఇటీవలే భారీఎత్తున 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు'ను చేపట్టిన సంగతి తెలిసిందే. కర్రెగుట్టల్లో మావోయిస్టుల ఆనవాళ్లు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఏప్రిల్ 22న ప్రారంభమైన ఆపరేషన్ 24 రోజులపాటు కొనసాగింది. ఇందులో 31 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు హతమార్చాయి. పలు బంకర్లను ధ్వంసం చేశాయి. 54 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయగా... 84 మంది లొంగిపోయారు. అలా కర్రెగుట్టల్లో ఆపరేషన్ ముగించిన వెంటనే ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతా బలగాలు ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్ మహారాష్ట్ర సరిహద్దులోని నేషనల్‌పార్క్ ఏరియాపై దృష్టిసారించాయి. మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధానకార్యదర్శిగా ఉన్న కేశవరావు మరణించడంతో ప్రస్తుతం ఆ పార్టీ చుక్కాని లేని నావలా మారింది

*** మన బలగాలను చూసి గర్విస్తున్నా: ప్రధాని మోదీ**

నంబాల కేశవరావు సహా 27 మంది దళ సభ్యుల మృతిపై ప్రధాని మోదీ బుధవారం ఎక్స్ వేదికగా స్పందించారు. "ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను చూసి గర్విస్తున్నా. మావోయిస్టుల ముప్పును నిర్మూలించి..ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు.

# అన్నదాతకు వానకాటు

(మొదటిపేజీ తరువాయి)

జనగామ, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, కుమురం భీం, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్ కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్ధిపేట, వనపర్తి, భువనగిరి జిల్లాల్లో వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లో విస్తారంగా వానలు పడటంతో వీధులన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మార్కెట్ యార్డులు, కల్లాల్లోని ధాన్యం తడిసి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. రోడ్లపై, కల్లాల్లో ఆరబోసినవి కొట్టుకుపోయాయి. వరంగల్ జిల్లా నర్సంపేట, ఖానాపురం మండలాల్లో 20 టన్నులకుపైగా ధాన్యం తడిసింది. సూర్యాపేట జిల్లాలోనూ భారీగా నీటిపాలైంది. నిర్మల్ జిల్లావ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం, తూకం వేసి తరలించడానికి సిద్ధంగా ఉంచిందీ తడిసిపోయింది. సారంగాపూర్ మండలం ఆలూర్‌లో తూకం వేసి తరలించడానికి సిద్ధం చేసిన బస్తాలపై కప్పడానికి కవర్లు అందుబాటులో లేక చీరలు కప్పారు. ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. తరలించడానికి సిద్ధంగా ఉంచిన బస్తాల్లోకి నీరు చేరింది. వరదలో వడ్లు కొట్టుకుపోయాయి. సకాలంలో కాంటాలు వేయకపోవడం.. లారీల కొరతతో మిల్లులకు ధాన్యం బస్తాలను తరలించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

**నేడు పలు జిల్లాల్లో...**

గురువారం నుంచి ఆదివారం వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గురువారం హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, సిద్ధిపేట, యాదాద్రి, మేడ్చల్ మల్కాజిగిరి, కామారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. శుక్ర, శని, ఆదివారాల్లోనూ హైదరాబాద్ సహా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వానలు పడతాయని తెలిపింది. ఈమేరకు ఆయా జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది.

# పాఠశాల సిలబస్‌లో యోగాను చేరుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

విశాఖలోని సాగర తీరంలో ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు లక్షల మంది యోగాసనాలు వేస్తారన్నారు. సముద్ర తీరంలో లక్షల మంది పాల్గొనేలా యోగా చేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారని, అరుదైన ఘటనగా చరిత్రలో నిలిచిపోతుందని ఆయన తెలిపారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా ప్రపంచ రికార్డులను నమోదు చేసే అన్ని సంస్థలనూ ఆహ్వానిస్తున్నట్లు బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబు తెలిపారు. దేశంలోని ప్రముఖ యోగా, ఆధ్యాత్మిక గురువులను ఆ కార్యక్రమానికి తానే స్వయంగా ఆహ్వానిస్తానన్నారు. ఆ రోజున విశాఖ సాగరతీరంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో కనీసం 2 కోట్ల మందిని భాగస్వాముల్ని చేయనున్నట్లు తెలిపారు. 'యోగా డే'లో పాల్గొనేవారు పేర్లు నమోదు చేసుకునేందుకు రూపొందించిన యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు పాల్గొన్నారు.

**10 లక్షల మందికి శిక్షణ**

ఈ నెల రోజుల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణ కోర్సుల ద్వారా 10 లక్షల మందికి యోగాలో శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. "యోగా డే' రోజున రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, విద్యా సంస్థల్లో జరిగే కార్యక్రమాలకు వారు నాయకత్వం వహిస్తారు. నెల రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా పాటలు, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహిస్తాం. వాటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని విశాఖలో జరిగే కార్యక్రమంలో భాగస్వాముల్ని చేస్తాం. మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా వంటి సంస్థల సేవలను వినియోగించుకుంటాం. వేసవి సెలవులు ముగిశాక జూన్ 21 వరకు పాఠశాలల్లో ఉదయం గంట సేపు యోగా తరగతులు బోధించాలి. రాబోయే రోజుల్లో యోగాను సిలబస్‌లో భాగంగా చేస్తాం. రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాలు, పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక యోగా కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. పెద్ద పెద్ద హోటళ్లలో కూడా యోగా, ధ్యానం కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తాం. యోగాకు సంబంధించి పాఠ్యపుస్తకాలు, పాటలు, వీడియోలు రూపొందించి ప్రజలకు అందజేస్తాం. యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పంచాయతీల స్థాయి నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులను భాగస్వాముల్ని చేస్తున్నాం. రాష్ట్రస్థాయిలో మంత్రులతో కమిటీని ఏర్పాటు చేశామ'ని సీఎం వివరించారు.

## భారత్‌కు గగనతలం మూసివేత.. మరో నెల పొడిగించనున్న పాక్!

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువ కాలం విధించేందుకు వీలులేదు. పాకిస్థాన్ గత నెల విధించిన నిషేధం మే 23 వరకు అమల్లో ఉంటుంది. ఆలోపు మరో నెలపాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇలా భారత విమానాలకు గగనతల ఆంక్షలను పాకిస్థాన్ గతంలోనూ విధించింది. 1999 కార్గిల్ యుద్ధం సమయంలో, 2019 పుల్వామా ఘటన తదనంతర ఉద్రిక్త పరిస్థితుల్లోనూ ఈ ఆంక్షలు కొనసాగాయి. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దాయాది దేశంపై ప్రతీకార చర్యలకు భారత్ ఉపక్రమించింది. ఇందులో భాగంగా సింధూ నదీ జలాల ఒప్పందం అమలు నిలిపివేతతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్‌ను విడిచి వెళ్లాలని ఆదేశించింది. అనంతరం ఆ దేశ విమానాలు భారత్ గగనతలంపై ప్రయాణించకుండా ఆంక్షలు విధించింది.



## బలోచిస్థాన్‌లో పేలుడు..
## పాక్ ఆరోపణలను తిప్పికొట్టిన భారత్

బలోచిస్థాన్‌లో పాఠశాల బస్సు లక్ష్యంగా జరిగిన ఆత్మాహుతి దాడిలో పలువురు చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది. సొంత వైఫల్యాల నుంచి ప్రపంచ దృష్టిని మరల్చే ప్రయత్నంలో భాగంగా ఈ ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టింది. అంతేకాకుండా స్థానిక సమస్యలకూ భారత్‌ను నిందించడం దాయాది దేశానికి అలవాటుగా మారిందని మండిపడింది. "ఖుజ్దార్‌లో చోటుచేసుకున్న దాడిలో భారత్ హస్తం ఉందంటూ పాకిస్థాన్ చేసిన నిరాధార ఆరోపణలను ఖండిస్తున్నాం. అటువంటి ఘటనల్లో మరణించిన వారికి భారత్ సంతాపం తెలిపింది. అయినప్పటికీ.. సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడంతోపాటు ఉగ్రవాదానికి అంతర్జాతీయ కేంద్రంగా పేరుగాంచిన వారు, ప్రపంచ దృష్టి మరల్చేందుకు ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారు. వారి



అంతర్గతంగా ఉన్న అన్ని సమస్యలకు భారత్‌ను నిందించడం పాక్‌కు పరిపాటిగా మారింది" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచాన్ని మోసగించేందుకు పాక్ చేస్తున్న ఈ తరహా ప్రయత్నాలు విఫలం అవుతున్నాయని అన్నారు. బలోచిస్థాన్‌లోని ఖుజ్దార్ ప్రావిన్స్‌లో ఓ పాఠశాల బస్సును లక్ష్యంగా చేసుకొని ఆత్మాహుతి దాడి జరిగింది. ఆ ఘటనలో ముగ్గురు చిన్నారులు సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. 38 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## బహుముఖ దార్శనికుడు రాజీవ్ గాంధీ

(మొదటిపేజీ తరువాయి)

పీవీ నరసింహారావు విగ్రహాలు, నిలువెత్తు అంబేడ్కర్ విగ్రహమున్న ఈ ప్రాంతంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఉండటం సముచితం. పార్టీలకు అతీతంగా ఆయనకు నివాళులర్పించాల్సి ఉంది" అని అన్నారు.

*** మేం తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నప్పుడు కిషన్‌రెడ్డి ఇంట్లో నిద్రపోతున్నారు**

"పహల్గాంలో ఉగ్రవాద దాడికి బదులుగా భారత జవాన్లు సరిహద్దుల్లో పోరాడుతుంటే వారికి మద్దతుగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడింది. నాలుగుకోట్ల ప్రజల తరఫున త్రివర్ణ పతాకం చేతబూని తిరంగా ర్యాలీని నిర్వహించాం. ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి మద్దతుగా నిలబడ్డాం. దేశ సమగ్రతను కాపాడుతున్న కేంద్ర ప్రభుత్వానికి బాసటగా మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ మాట్లాడారు. వీటిని విస్మరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. రాహుల్ గాంధీని నిందిస్తున్నారు. మేం తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నప్పుడు కిషన్‌రెడ్డి ఇంట్లో దుప్పటి కప్పుకొని నిద్రపోతున్నారు. రాష్ట్రం మొత్తం జవాన్లకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తే అభినందించేందుకు ఆయనకు నోరు రాలేదు.. పైగా దూషణలకు దిగుతున్నారు. పాకిస్థాన్‌ను ఓడిస్తే ప్రపంచమంతా మీకు (కేంద్రానికి) ఆహ్వానం పలుకుతుంది. ఇందుకు భిన్నంగా మీరు గొప్పలు చెప్పుకొనేందుకు పార్టీ శ్రేణులను రోడ్లపై తిప్పుతున్నారు. భాజపా నాయకులు గొప్పవాళ్లో... కాదో ప్రజలు నిర్ణయిస్తారు. ఇప్పటికైనా ఉగ్రమూకలను ఏరివేయండి. ఉగ్రవాదం పీచమణచండి.. పార్టీలకు అతీతంగా మీకు అండగా ఉంటాం.

*** ప్రజలంతా ఉక్కు మహిళ ఇందిరను స్మరించుకున్నారు**

పహల్గాం దాడి అనంతర ఘటనల సందర్భంగా ప్రజలంతా ఉక్కు మహిళ ఇందిరా గాంధీని స్మరించుకున్నారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గకుండా నాడు పాకిస్థాన్‌ను నిట్టనిలువునా చీల్చేసి బంగ్లాదేశ్ ఏర్పాటుకు కారణమై... పాకిస్థాన్‌కు శాశ్వత గుణపాఠం నేర్పారని గుర్తు తెచ్చుకున్నారు. అమెరికా అధ్యక్షుడి మాటలను లెక్కచేయకుండా నిటారుగా నిలబడిన ఆమె ధైర్యాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు" అని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మక్కాన్‌సింగ్ ఠాకూర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, రాష్ట్ర పరిశీలకుడు విశ్వనాథ్, మాజీ ఎంపీ వీహెచ్, మేయర్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## భారత్ బయోటెక్ కలరా టీకా హిల్‌కాల్

(మొదటిపేజీ తరువాయి)

ఇనబా సెరోటైప్ రెండింటిపైనా ఇది సమర్థంగా పనిచేస్తున్నట్లు నిర్ధారణ అయింది. తద్వారా పెద్దలు, పిల్లలను కలరా వ్యాధి నుంచి కాపాడే అవకాశం లభిస్తుంది. 'హిల్‌కాల్' అనేది నోటి ద్వారా తీసుకునే కలరా టీకా (ఓసీవీ ఓరల్ కలరా వ్యాక్సిన్) కావడం మరో ప్రత్యేకత. ఈ టీకాపై నిర్వహించిన మూడో దశ క్లినికల్ పరీక్షల ఫలితాలను సైన్స్ డైరెక్ట్‌కు చెందిన వ్యాక్సిన్ జర్నల్ ప్రచురించింది. దేశంలోని 10 ప్రాంతాల్లో పెద్దలు, పిల్లలు కలిపి 1800 మందిపై ఈ టీకా పరీక్షలు నిర్వహించారు. టీకా తీసుకున్న వారిలో రోగ నిరోధక శక్తి పెరిగింది. వారిలో ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కానందున, ఈ టీకా భద్రమైందని తేలింది. ఈ సమాచారాన్ని నియంత్రణ సంస్థలకు అందించి, తుది అనుమతులు పొందాక విపణిలోకి విడుదల చేస్తారు.

**వర్ధమాన దేశాలకూ మేలు**

కలరా వ్యాధిని టీకా ద్వారా అదుపు చేయొచ్చని, కానీ టీకా తగినంతగా అందుబాటులో లేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నట్లు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్ల అన్నారు. నోటి ద్వారా తీసుకునే టీకా అయిన హిల్‌కాల్‌తో ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా నిరోధించొచ్చని, తక్కువ ఖర్చులో లభించే ఈ టీకాతో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మేలు జరుగుతుందని వివరించారు.

**ఏటా 95,000 మంది మృతి**

ఆహారం, నీటి కల్తీ వల్ల కలరా వ్యాధి విస్తరిస్తుంది. ఏటా 28 లక్షల మంది ఈ వ్యాధి బారిన పడుతుంటే, దాదాపు 95,000 మంది చనిపోతున్నారు. నోటి ద్వారా తీసుకునే కలరా టీకా అమ్మకాలు ఏటా 10 కోట్ల డోసుల వరకు నమోదవుతున్నాయి. ప్రస్తుతం ఒకే కంపెనీ ఇటువంటి టీకాను సరఫరా చేస్తున్నందున, టీకా లభ్యత సమస్యగా ఉంది. భారత్ బయోటెక్ హైదరాబాద్, భువనేశ్వర్‌లోని తన యూనిట్లలో ఏడాదికి 20 కోట్ల డోసుల టీకా ఉత్పత్తి చేయడానికి తగిన సన్నాహాలు చేస్తోంది.

## కుంకీలు వచ్చేస్తున్నాయ్

బెంగళూరు: కర్ణాటకఆంధ్రప్రదేశ్ మధ్య గత ఆగస్టులో చేసుకున్న ఒప్పందం ప్రకారం కన్నడనాడు నుంచి కుంకీ ఏనుగులను తరలించారు. బెంగళూరులోని విధానసౌధ ముంగిట బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే ఈ ఏనుగుల బదిలీ ఆదేశ పత్రాలను ఆంధ్రప్రదేశ్ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అందించారు. ఒప్పందం ప్రకారం ఆరు కుంకీ ఏనుగులను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించాల్సి ఉన్నా శిక్షణ, ఆరోగ్య ప్రమాణాల దృష్ట్యా బుధవారం నాలుగింటినే తరలించారు. మరో విడతలో మిగిలిన రెండూ వస్తాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ మనుషులకు, ఏనుగులకు మధ్య సంఘర్షణలను నివారించేందుకు రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని వెల్లడించారు. గతేడాది ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కుంకీ ఏనుగుల కోసం ప్రతిపాదన చేయగానే తాను అంగీకరించానన్నారు. కర్ణాటకలో 3,695 ఏనుగులున్నట్లు వెల్లడించిన సిద్ధు.. దేశంలో అత్యధిక సంఖ్యలో ఇక్కడే ఉన్నాయన్నారు. ఏపీకి నాలుగు కుంకీలను పంపుతున్నామని, నెలపాటు వాటి మావటీలు ఏపీ బృందాలకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా మానవ, ఏనుగుల సంఘర్షణ కొనసాగుతోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటక ఇచ్చిన సహకారాన్ని ఆయన కొనియాడారు. ఈ సంఘర్షణను నివారించటంలో కర్ణాటక చేపడుతున్న చర్యలు అనుసరణీయమన్నారు. రెండు వేర్వేరు పార్టీలకు చెందిన ప్రభుత్వాలున్నా పర్యావరణం, ప్రకృతి పరిరక్షణకు మనమంతా భారతీయులమన్న సమైక్యతా సందేశాన్ని ఈ ఒప్పందం నిరూపించిందని చెప్పారు. కర్ణాటక అందించిన ఈ ఏనుగులు భవిష్యత్తులో ఎన్నో ప్రాణాలను, పంట నష్టాన్ని నివారిస్తాయన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిలువరింత, అటవీ సంపద రక్షణలో ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయం కొనసాగుతుందని ప్రకటించారు. కుంకీ ఏనుగుల పోషణను తానే పర్యవేక్షిస్తానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. తన ప్రసంగంలో ఎక్కువగా కన్నడ భాషనే ఉపయోగించిన పవన్.. కన్నడ జాతీయ కవి కువెంపు ప్రకృతిపై రచించిన కవితలను చదివి వినిపించారు. ఇదే సందర్భంగా అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే మాట్లాడుతూ కుంకీ ఏనుగులను ఇతర రాష్ట్రాలకు తరలించటంపై పలు విమర్శలు వస్తున్నాయని, వాటిని పట్టించుకోకుండా ప్రస్తుత కార్యక్రమం చేపట్టామన్నారు. తమ వద్ద అవసరానికి మించి కుంకీ ఏనుగులున్నాయని, పొరుగు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి వాటిని పంపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, కర్ణాటక అటవీశాఖ కార్యదర్శి మీనాక్షి నేగి, ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము, హెచ్ఓఎఫ్ఎఫ్ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఎ.కె. నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరంలో దిగ్విజయంగా జరుగుతున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా ప్రతి రోజు సాయంత్రం సరస్వతి నవరత్న మాలా హారతి ఇస్తున్న కాశీ పూజారులు

# త్రిలింగ క్షేత్రమైన కాళేశ్వరంలో ఏడో రోజుకు చేరుకున్న సరస్వతి పుష్కరాలు

త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించే భక్తులు తమ శక్తి కొద్ది దానాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. గోదావరి, ప్రాణహిత నదుల సంగమించిన కాళేశ్వరంలో ప్రవహిస్తున్న అంతర్వాహిని సరస్వతి నది బ్రహ్మపత్ని పేరిట వెలియడం విశేషం. త్రిలింగ క్షేత్రంలో లింగాకారంలో యముడు, శివుడు ఒకే పానవట్టంపై సాక్షాత్కరించడమే కాకుండా, ఈ ఆలయంలో అత్యంత ప్రాశస్త్యం ఉన్న చరిత లిఖించి ఉంది. భక్తులకు మోక్షాన్ని ఇచ్చే శివుడు, పాపాత్ములకు పనిష్మెంట్ ఇచ్చే యముడు ఒకే చోట వెలిసిన చరిత్ర కాళేశ్వరం సొంతమనే చెప్పాలి. మరో వైపున ఉత్తరాదిన దేవదారుకారుణ్యం విస్తరించిన కశ్మీర్ లో బాల సరస్వతిగా ఉద్భవించిన అమ్మవారు దండకారణ్యంలోనే మరో రెండు రూపాలలో సాక్షాత్కరించడం తెలంగాణాకే తలమానికంగా నిలుస్తోంది. నిర్మల్ జిల్లా బాసరలో జ్ఞాన సరస్వతిగా భక్తులకు దర్శనం ఇస్తుండగా కాళేశ్వరంలో మహా (పౌఢ) సరస్వతిగా ఆశీస్సులను అందిస్తోంది. హిమాలయాల్లో పుట్టిన సరస్వతి నది అంతర్ధానం అవుతూ అక్కడక్కడ తన ఉనికిని బయటపెడుతూనే ఉంది. శతాబ్దాల క్రితమే బౌగోళికంగా వచ్చిన మార్పుల వల్ల అంతర్ధానం అయిన సరస్వతి నది రెండు నదులు సంగమించే కాళేశ్వరంలో అంతర్వాహినిగా ప్రవహిస్తోందని పురాణ ఇతిహాసాలు చెప్తున్నాయి. దేశంలో అత్యంత అరుదైన సరస్వతి నదికి దక్షిణాది రాష్ట్రాల్లోనే ఒకే ఒక చోట పుష్కరాలు జరుగుతున్నాయి. అది జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం కావడం విశేషం. అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి నది కూడా మహా సరస్వతిగా అవతరించిన కాళేశ్వరంలోనే ఉండడం ఇక్కడ మరో ప్రత్యేకత. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న కాళేశ్వరం తెలంగాణ, మహారాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతాల్లో ఉన్నది. కీకారణ్యాలు కూడా విస్తరించడం వల్ల కాళేశ్వరం చరిత్ర సరస్వతి నది పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుండడంతో బాహ్య ప్రపంచానికి తెలిసేలా చేసింది.

**అక్కడ అలా ఇక్కడ ఇలా...**

త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు పుష్కర స్నానాలతో తన్మయత్వం చెందుతున్నారు. చిన్నా, పెద్దలంతా త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు చేస్తూ సంభ్రమాశ్చార్యాల్లో మునిగిపోతున్నారు. శివ నామస్మరణతో పాటు సరస్వతి నదిని పూజిస్తు పుష్కర స్నానాలు చేస్తుంటే... త్రిలింగ క్షేత్రమైన కాళేశ్వరం హర హర మహదేవ అంటూ భక్తులు నినదిస్తున్నారు. మరో వైపున ఈ భోళా శంకరుని కోసం శంఖం ఉదుతూ భక్తి పారవశ్యంలో మునిగి తేలుతున్నారు.

**ఏడో రోజున..?**

పుష్కర నదిలో పుణ్య స్నానం ఆచరించిన తరువాత దాన ధర్మాలు చేయడం కూడా ముఖ్యమని పూర్వీకులు చెప్పేవారు. ఇందులో భాగంగా నేటికీ




కూడా పుష్కర నదీ తీరంలో దానాలు చేసే సాంప్రాదాయం కొనసాగుతోంది. ఏడో రోజున గృహదానం, పీటల దానం, శయ్య దానం చేయడం వల్ల శుభం కలుగుతోందని చరిత్ర చెబుతోంది. అయితే ఇక్కడ ప్రధానంగా గమనించాల్సిన విషయం ఏంటంటే... ఆధ్మాత్మిక భావనతో పుణ్య స్నానాలు చేయడం వల్లే ఫలితం దక్కదు... దాన గుణాన్ని కూడా అలవర్చుకోవాలన్నదే నాటి తరం అభిమతం. అయితే ఇప్పుడిదో సెంటిమెంట్ గా మారిపోయి పెద్దలు ఆచరించారని, మేమూ ఆచరిస్తున్నామని దానాలు చేస్తున్నారు. వాస్తవంగా పుణ్య స్నానం ఆచరించి పునీతులు కావడం కాదు మానవత్వాన్ని ప్రదర్శించడంతోనే పరిపూర్ణత దక్కుతుం దన్నదే ఈ ఆచారంలో దాగి ఉన్న నిగూఢత. గోదావరి నది ప్రవహించే ఎగువ ప్రాంతానికి త్రివేణి సంగమంగా ఉన్న కాళేశ్వరం ప్రాంతానికి చాలా వైవిధ్యమైన పరిస్థితులు ఉంటాయి. ఎగువ ప్రాంతంలో మానేరు లాంటి చిన్న చిన్న నదులు మాత్రమే గోదావరి నదిలో కలుస్తుండడం వల్ల నీరు అంతగా గోదావరి నదిలో కనిపించదు. కానీ కాళేశ్వరం వద్దకు చేరుకున్న తరువాత ప్రాణహిత నది నుండి భారీగా జలాలు గోదావరి నదిలో వచ్చి కలుస్తూనే ఉంటాయి. దీంతో కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో నీటి కొరత అనేది ఉండదన్నది వాస్తవం. అయితే ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులు సంగమించడం వల్ల, దిగువ ప్రాంతానికి వస్తున్న గోదావరి నదిలో వరద ఉధృతి తీవ్రంగా ఉండడం వల్ల కాళేశ్వరం ప్రాంతంలో నది తీరం అంతా వెడల్పుగా విస్తరించింది. ఇక్కడ గోదావరి దాదాపు 2 నుండి 3 కిలో మీటర్ల మేర ప్రవహిస్తోంది. నది ప్రవహానికి ఇరువైపులా కిలోమీటర్ల మేర ఇసుక కనిపిస్తుండడంతో నీటి ప్రవాహం చిన్న పాయలా కనిపిస్తూ ఉంటుంది. కానీ ఎగువ గోదావరితో పాటు దిగువ గోదావరి ప్రాంతంలో కన్న ఎక్కువ నీటి లభ్యత కాళేశ్వరం త్రివేణి సంగమంలోనే ఎక్కువ ఉంటుంది. నీటి ప్రవాహం కూడా దిగువ ప్రాంతానికి సాగుతున్నందున కాళేశ్వరంలో పుణ్య స్నానాలు చేయడం వల్ల రుగ్మతలు సోకే అవకాశం కూడా ఉండదు.



# సరస్వతి పుష్కరాలలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది సేవలు భేష్

* **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.**

కాళేశ్వరం మే21( సమయం న్యూస్) : సరస్వతి పుష్కరాల సందర్భంగా జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరంలో ఈ నెల 15వ తేదీ నుండి 26వ తేదీ వరకు జరుగనున్న సరస్వతి పుష్కరాలలో పుష్కర ఘాట్ వద్ద భక్తుల భద్రత కోసం ప్రత్యేకంగా నియమించబడిన సింగరేణి రేస్క్యూ సిబ్బంది 35 మంది అత్యుత్తమంగా సేవలందిస్తున్నారు. పుష్కరాల ప్రారంభం నాటి నుండి ఇప్పటివరకు అస్వస్థతకు గురైన ఎందరో భక్తులను సురక్షితంగా 108 వాహనం వద్దకు తరలిస్తున్నారు. కొన్ని సందర్భాలలో ఎవరైనా భక్తులు గోదావరి ప్రవాహంలో చిక్కుకున్న వారిని సైతం రక్షించడానికి కావలసిన రెస్క్యూ సామాగ్రితో సిద్ధంగా ఉన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సింగరేణి రెస్క్యూ సిబ్బంది టీం సభ్యుల సేవలను అధినందించరు. పుష్కరాల సందర్భంగా అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో, రెస్క్యూ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ నీటిలో చిక్కుకునే ప్రమాదాల నుంచి భక్తుల రక్షణతో పాటు ప్రాథమిక వైద్య సేవలు అందించడానికి కృషి చేసున్నారని కలెక్టర్ అభినందించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

* **కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి**



జడ్చర్ల మే 21(సమయం న్యూస్) : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. బుధవారం జడ్చర్ల మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటించి మండలంలోని గంగాపూర్, కొడుగల్ గ్రామం లలో ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం (పి. ఏ.సి.ఎస్) ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం లలో రైతులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమ శాతం పరీక్షించారు. జడ్చర్ల మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, బాదేపల్లి ద్వారా గంగా పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం ను త్వరగా కొనుగోలు కేంద్రంకు టాగ్ చేసిన రైస్ మిల్లకు రవాణా చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను, అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని తేమ, నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి ధాన్యానికి క్రమ పద్ధతి లో టోకెన్ లు అంద చేసి కొనుగోలు చేసిన వెంటనే రైతులకు ఇబ్బంది లేకుండా మిల్లులకు రవాణా చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి ప్రతి రోజూ ఎన్ని లారీలు రవాణా చేయుటకు ఏర్పాటు చేశారు అని అడిగారు. 6 లారీల ద్వారా ధాన్యం రవాణా చేస్తున్నట్లు కలెక్టర్ కు వివరించారు ఇంకా కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు ఉన్నాయి వెంటనే కావలసిన లారీలు ఏర్పాటుచేసి రవాణా చేయాలని సూచించారు .కొడుగల్ గ్రామంలో పి. ఏ. సి.ఎస్. ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతు విక్రయించిన ధాన్యం ను కొనుగోలు పత్రం జారీ చేసిన తర్వాత రైతులను వేచి ఉంచకుండా కేంద్రం నిర్వాహకులు బాధ్యత తీసుకుని ధాన్యం బస్తాలు తరలించాలని స్పష్టం చేశారు. రైతుల సౌకర్యార్థం ధాన్యం కొనుగోలు కేంద్రంలలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు, రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్యాడి క్లీనర్ లను ఉపయోగించి ధాన్యం శుభ్రపరచాలని రైతులకు, నిర్వాహకులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు .జిల్లా కలెక్టర్ వెంట పౌర సరఫరాల సంస్థ డి.ఎం.రవి నాయక్ తదితరులు ఉన్నారు. పి.హెచ్.సి ని తనిఖీ చేసిన కలెక్టర్

జడ్చర్ల మండలం లో గంగాపురం గ్రామం పి.హెచ్.సి.ని బుధవారం కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పి.హెచ్.సి ఆవరణలో చెత్తాచెదారం పడి ఉండి పరిశుభ్రత లేకపోవడం గమనించి కలెక్టర్ సంబధిత వైద్య సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు . పి.హెచ్. సి ఆవరణ, గదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రతి నెల పి.హెచ్.సి లో నిర్వహించే ప్రసవాల గురించి తెలుసు కున్నారు. ఓ.పి. రిజిస్టర్ ను పరిశీలించారు .బుధవారం 80 మంది ఓ.పి .నమోదు చేసుకున్నట్లు వైద్య అధికారి వివరించారు.ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగారు. .మందుల కొరత లేదని మెడికల్ ఆఫీసర్ తెలిపారు.

# దేశ సమగ్రత కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ

* **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

ఈ దేశ సమగ్రత కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు, దేశంలో కంప్యూటర్ విప్లవాన్ని తీసుకువచ్చిన గొప్ప దార్శనికుడు దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ దేశం పారిశ్రామిక విప్లవాన్ని అందుకోలేక పోయింది, కంప్యూటర్ విప్లవాన్ని వదులుకునేందుకు తాను సిద్ధంగా లేనని ఈ దేశాన్ని ఆధునిక యుగం వైపు అడుగులు వేయించారని కీర్తించారు. దేశ సమగ్రతకు విఘాతం కలిగించే LTTE వంటి ఉగ్రవాద సంస్థలను కట్టడి చేశారు, ఈ క్రమం లో దేశం కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయని ధీరొదాత్తుడు రాజీవ్ అని కొనియాడారు. క్లిష్ట సమయంలో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశ సర్వతోముఖాభివృద్ధి కి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. వారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.

# భూసమస్యల దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి..

* **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**


నిర్మల్ మే21(సమయం న్యూస్) : రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూసమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. భూభారతి చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న కుంటాల మండలంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులు విజయవంతంగా ముగియడంతో బుధవారం కలెక్టర్ కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా మొత్తం 667 భూ సంబంధిత దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ వెల్లడించారు. మిస్సింగ్ సర్వే నంబర్లు, సాధాబైదామా, పేరు, చిరునామా మార్పులు, తప్పుల సవరణలు, మ్యూటేషన్ వంటి సమస్యలు తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులపై అధికారులు వివరాలను కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసి, ఇరు పక్షాల సమక్షంలో పారదర్శక విచారణ జరిపి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రేపటి నుంచే చర్యలు చేపట్టాలని, దరఖాస్తుదారులను ఇయరింగ్‌కు పిలిపించి,



రోజువారీగా పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించారు. పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేవలు అందించడంతో పాటు, ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, తహసీల్దార్లు కమల్ సింగ్, ప్రవీణ్ కుమార్, ఏజాజ్ అహ్మద్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిన్నారం తహసీల్దారుగా దేవదాసు

జిన్నారం, మే 21, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల తహసిల్దారుగా దేవదాసు బుధవారము రోజు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిన్నారం తాసిల్దార్ గా పనిచేసిన భిక్షపతి బదిలీపై హైద్రాబాద్ కు వెళ్ళారు. సంగారెడ్డి తాసిల్దార్ గా పనిచేసిన దేవదాసు బదిలీపై జిన్నారం వచ్చాడు. .ఈ సందర్భంగా తాసిల్దార్ దేవదాసు మాట్లాడుతూ మండలంలోని మండలంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమణకు గురికాకుండా చూస్తానని ఆయన అన్నారు. రెవెన్యూ



సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. మండల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని ఆయన పేర్కొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

\- **గుమ్మడిదల ఎ.డి. దుర్గా ప్రసాద్**

గుమ్మడిదల , మే 21, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా గుమ్మడి దల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి , దోమడుగు పారిశ్రామిక ఫీడర్లపై వున్న పరిశ్రమలలో గురువారంనాడు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని గుమ్మడిదల ఎ.డి దుర్గా ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుండిగల్ ఎయిర్పోర్ట్ అకాడమీ 33/11 కెవి సబ్ స్టేషన్ లో మరమత్తుల కారణంగా బొంతపల్లి, దోమడుగు పారిశ్రామిక వాడల్లో, అన్నారం, ప్రకృతి నివాస్, నల్లవల్లి, సోలక్ పల్లి, శివానగర్, సబ్ స్టేషన్లో మరమత్తు కారణంగా ఆయా గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంతపల్లి ఏఈ రవీందర్, జిన్నారం ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




## నల్లవల్లి లో... కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల,మే21, సమయం న్యూస్: గుమ్మడిదల మున్సిపాలిటీ లోని నల్లవల్లి,ప్యారానగర్ పరిధిలో ప్రతిపాదిత డంప్ యార్డ్ కు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 106వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల జేఏసీ నాయకులు ,నల్లవల్లి గ్రామస్తులు పాల్గొన్నారు. గతంలో తహసిల్దార్ కార్యాలయంలో డంప్ యార్డ్ కు వ్యతిరేకంగా మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ వినతులను తహసిల్దార్ కార్యాలయంలో ఇవ్వడం జరిగిందని. ఇకనైనా ప్రభుత్వం,అధికారులు స్పందించి ప్రజాభిప్రాయం మేరకు డంప్ యార్డును పూర్తిగా రద్దుచేసి, ఈ ప్రాంత ప్రజలకు రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు,మహిళలు,గ్రామస్తులు పాల్గొన్నారు.




## ఎస్టీ జాబితాలోకి నక్కల కులస్తులు

* **ఎట్టకేలకు ప్రభుత్వ నిర్ణయం..**
* **సర్టిఫికెట్ల అందజేత..**

తోగుట. మే 21( సమయం న్యూస్) : నక్కల కులస్తులను ఎస్టి జాబితాలో చేర్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో నక్కల కులస్తులలో ఆనందం పెల్లి విరిసింది. తొగుట మండలం చిన్న ముత్యంపేట గ్రామంలో నివాసం ఉంటున్న నక్కల కులస్తులకు ఎస్టీ కులం సర్టిఫికెట్లను జారీ చేశారు. త్వరలోనే గ్రామంలోని అన్ని కుటుంబాలకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు రెవిన్యూ అధికారులు. తాసిల్దార్ శ్రీకాంత్ గ్రామాన్ని సందర్శించి ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు సర్టిఫికెట్లను సద్వినియోగం చేసుకొని. సంక్షేమ ఫలాలు పొందాలన్నారు.కాగా ప్రభుత్వ నిర్ణయంతో ముత్యంపేటలోని సుమారు 80 కుటుంబాలకు న్యాయం జరగనుంది.



## శ్రీ సాయి నాథునికి మొదటి వస్త్రాల బహుకరణ

శివంపేట్ మే 21 (సమయం న్యూస్ ) : మెదక్ జిల్లా..శివ్వంపేట ..శివ్వంపేట మండలం.. గూడూరు గ్రామంలో గల శ్రీ గురుపీఠంలో జూన్ 5వ తేదీన జరిగే శ్రీ షిరిడి సాయిబాబా ప్రాణప్రతిష్ట పూజా కార్యక్రమం సందర్భములో శ్రీ షిరిడి సాయి తత్వ బోధకులు మైనంపాటి ప్రసాద్ శ్రీ సాయినాథునికి మొట్ట మొదటి రోజు అలంకరించే వస్త్రాలను శ్రీ గురు పీఠం ట్రస్టు చైర్మన్ జిన్నారం పెద్దగోని శివ కుమార్ గౌడ్, సభ్యులు మరేళ్ళ మోహన్ రావు లకు బహుకరించారు.దత్త స్వరూపులైన షిరిడి సాయినాధుని కరుణాకటాక్షాలు మైనంపాటి ప్రసాద్ పైన, ఆయన కుటుంబంపై సదా వర్షించాలని కోరుకుంటున్నట్లు ట్రస్టు చైర్మన్ శివ కుమార్ గౌడ్, మరియు ట్రస్టు సభ్యులు తెలిపారు.

# శ్రీ దత్తాత్రేయ సాయిబాబా దేవాలయ గుడి నిర్మాణానికి రెండు లక్షలు విరాళం..!

* **ధనరాజ్ కుమార్ గౌడ్ దంపతులు!!**



శివంపేట్ మే 21 (సమయం న్యూస్ ) : శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ గూడూరు గ్రామంలో, శివం పేట మండలం మెదక్ జిల్లాలో మొట్టమొదటిసారిగా ప్రపంచంలోనే అరుదైన దివ్యమైన భవ్యమైన శాస్త్రోక్త దేవాలయం శ్రీ దత్తాత్రేయ మహా స్వామి కలియుగ దత్త అవతార్ల సహిత గురుపరంపర తెలియజేసే శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయం, ఆది వృక్షాల పంచవటి, శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో జూన్ మూడు నాలుగు ఐదో తారీకు లో నిర్వహించే దివ్యమూర్తుల ప్రాణ ప్రతిష్ట పూజా కార్యక్రమానికి రావలసిందిగా ప్రముఖ వైద్యులు పారమిత హాస్పిటల్ అధినేత జిన్నారం పెద్దగౌని ధనరాజ్ కుమార్ గౌడ్ హిమ ను ఆహ్వానిస్తూ శ్రీ గుడి పీఠం చాటిబుల్ ట్రస్ట్ సభ్యులు శ్రీ జిన్నారం పెద్దగోని శ్రీనివాస్ గౌడ్ మరియు రాజ్యం బిక్షపతి ఆహ్వాన పత్రికను అందజేశారు. ధనరాజ్ కుమార్ హిమ స్పందిస్తూ మన కుటుంబం తరపున ఈ ఇలాంటి అద్భుతమైన దేవాలయాలు నిర్మించడం చాలా సంతోషకరమైన విషయం మా వంతుగా 2 లక్షల రూపాయల విరాళాన్ని అందజేస్తున్నామని తెలియజేశారు. శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఖాతాకు ధనరాజ్ కుమార్ పరమిత హాస్పిటల్ తరఫున రెండు లక్షల రూపాయలు అందజేశారు. ప్రతిష్ట కార్యక్రమానికి కుటుంబ సమేతంగా వస్తామని తెలియజేశారు. శ్రీ ధనరాజ్ కుమార్ హిమ మరియు వారి కుటుంబ సభ్యులందరినీ ఆ దత్తాత్రేయ స్వామి మరియు షిరిడి సాయిబాబా సదా ఆయురారోగ్యాలతో, సకల సౌభాగ్యాలతో సుఖ సంతోషాలతో గురుదేవులను స్మరిస్తూ జీవనం సాగేలా ఆ దివ్య గురువుల కరుణ వారి కుటుంబంపై వర్షించాలని శ్రీ గురుపీఠం ట్రస్ట్ సభ్యులందరూ ప్రార్థిస్తూ ధనరాజ్ కుమార్ హిమ దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ముందస్తు ఋతుపవనాలపై జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, మే 21( సమయం న్యూస్): ప్రస్తుత వర్షా కాల సీజన్ లో ఈ నెలాఖరులోగా రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయని, దీనితో రాష్ట్రంలోని పలు జిల్లాలో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున, ఏవిధమైన విపత్తులు జరుగకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. తెలంగాణ రాష్ట్రంలో మే మాసాంతం వరకే రుతుపవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో జిల్లాలకు ముందస్తు చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తగు మార్గదర్శకాలను విడుదల చేశారు. గత 2024 ఆగస్టు మాసంలో వచ్చిన భారీ వర్షాలతో సకాలంలో ఎన్డీఆర్ఎఫ్ దళాలు చేరుకోక పోవడంతో జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని, ముందస్తుగానే ఈసారి 12 స్టేట్ డిసాస్టర్ రిలీఫ్ ఫోర్స్ (SDRF ) లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఒక్కో టీమ్ లో తెలంగాణా స్పెషల్ పోలీస్ కు చెందిన 100 సుశిక్షితులైన పోలీసులు ఉంటారని, ఈ బృందాలను రాష్ట్రంలోకి పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేశామని చెప్పారు. తద్వారా, ఎక్కడైనా భారీ వర్షాలు, తుఫానులు వచ్చినా, వెంటనే సమీపంలోని SDRF బృందాలు చేరుకుంటాయని కలెక్టర్లకు తెలిపింది. దీనితో పాటు, ఈ సారి 3 NDRF బృందాలు హైదరాబాద్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భారీ వర్షాలు వచ్చే జిల్లాల్లో ఈసారి ప్రత్యేకంగా అదనపు NDRF బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని NDRF కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉన్న అన్ని ఫైర్ స్టేషన్లలో ఫైర్ సిబ్బందికి ప్రత్యేకంగా విపత్తుల నివారణ చర్యలపై శిక్షణను ఇప్పించామని అన్నారు. హైదరాబాద్ తోపాటు శివారు ప్రాంతాలకు తక్షణమీ స్పందించేలా హైడ్రా బృందాలను ఏర్పాటు చేసాం. భారీ వర్షాలు, ఆకస్మిక వర్షాలు వస్తే నష్టాలను తగ్గించడానికి పై చర్యలు ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదలు వచ్చే అవకాశముంటే, సంబంధిత జిల్లాలకు కేటాయించిన SDRF , NDRF బృందాలతో టచ్ లో ఉండాలని ఆయా బృందాల వివరాలు సంబంధిత అధికారులకు కూడా ఇవ్వాలని సూచించారు. అప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లు తమ జిల్లాల ఫైర్ ఆఫీసర్లతో సంప్రదిస్తూ, స్టేట్ డిజాస్టర్ ఫోర్స్ సేవలను పొందాలని, అత్యవసర పరిస్థితుల్లో NDRF సేవలు కావాలంటే స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖతో టచ్ లో ఉండాలని పేర్కొన్నారు. విపత్తుల నివారణలో సుశిక్షితులైన సింగరేణి కాలరీస్ సిబ్బంది సేవలను కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. తమ జిల్లాలోని వరదలు, వర్షాల వల్లముంపు ప్రాంతాలు, ఇతర సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీచేశారు.

# గిరిజన సంక్షేమ శాఖలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం




హైదరాబాద్ మే21( సమయం న్యూస్) : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్నటువంటి గిరిజన గురుకులాలు, EMRS పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో 202425 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మరియు పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఈరోజు మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క గారిచే సన్మానం చేయడం జరిగింది. ఇంటర్మీడియట్ ఫలితాలలో గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థులు 84.94% ఉత్తీర్ణత సాధించడం జరిగింది. ఇంటర్మీడియట్ ఫలితాల్లో గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల దేవరకొండలో చదివినటువంటి కుమారి కేతావత్ అఖిల 1000 మార్కులకు గాను 996 మార్కులు సంపాదించి బైపీసీ లో రాష్ట్రంలో రెండవ ర్యాంకు సంపాదించింది. కుమారి కేతావత్ స్రవంతి గురుకుల కళాశాల పరిగి నుండి 1000 మార్కులకు 994 మార్కులు సాధించి ఎంపి MPC లో రాష్ట్రంలో నాలుగో ర్యాంకు సంపాదించింది. పాడియా మౌనిక గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల కేసముద్రం నుండి 1000 మార్కులకి గాని 980 మార్కులు సంపాదించి CEC లో రాష్ట్రంలో ఎనిమిదో ర్యాంకును సాధించింది. మొత్తం మీద గిరిజన విద్యార్థిలు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం నందు 28 మంది రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 71 మంది రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. EMRS విద్యార్థులు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో 89.51 శాతం ఉత్తీర్ణత సాధించటం జరిగింది. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థులు 900 కి పైగా మార్కులు సాధించిన వారు 1,224 మంది ఉన్నారు. SSC ఫలితాలలో గిరిజన గురుకుల విద్యార్థులు 98.08% విజయం సాధించారు. ఇది రాష్ట్ర సగటు కంటే 6 శాతం ఎక్కువ. 486 మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించారు. 41 పాఠశాలలు 100% ఫలితాలు సాధించాయి. EMRS సంస్థలో 23 పాఠశాలలకు గాను 22 పాఠశాలలు 100% ఫలితాలు సాధించాయి. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు 95% ఉత్తీర్ణత సాధించడం జరిగింది. 141 ఆశ్రమ పాఠశాలలు మరియు 86 ఎస్టి హాస్టల్లు 100% ఫలితాలు సాధించాయి. 160 మంది విద్యార్థులు SSC లో 90 శాతానికి పైగా మార్కులు సాధించారు. రమావత్ మోహన్ 600 లకు 582 మార్కులు మరియు మాడే మౌనిక 600 లకు 575 మార్కులు సాధించారు. వీరందరినీ మంత్రి, డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క గారు అభినందించి, మెడల్ తో పాటు సర్టిఫికెట్ ఇచ్చి సత్కరించారు. మంత్రి సీతక్క గారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వము గిరిజన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందిస్తుంది కాబట్టి జీవితంలో ఒక మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాని సాధనకై కృషిచేసి మంచి ఉన్నత స్థాయిలో స్థిరపడి వారి తల్లిదండ్రులకు గురువులకు వారి గ్రామానికి మంచి పేరు తేవాలని తెలియజేశారు. అదేవిధంగా మనము ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని అదేవిధంగా మన యొక్క గిరిజన సంస్కృతి, భాష మరియు ఆచార వ్యవహారాలను మరచిపోవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి, డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క గారితో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే, బెడమ బొజ్జు గారు, GCC చైర్మన్, కోట్నాక్ తిరుపతి గారు, TRI COR చైర్మన్, బెల్లయ్య నాయక్ గారు, గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, డాక్టర్ ఏ. శరత్, ఐఏఎస్ గారు, గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి, శ్రీమతి సీతాలక్ష్మి, ఐఏఎస్ గారు, గిరిజన సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి, శ్రీ వి. సర్వేశ్వర్ రెడ్డి గారు, TCRI & TI డైరెక్టర్, డాక్టర్ వి. సముజ్వల గారు, GCC GM, శ్రీ సీతారాం నాయక్ గారు, గురుకుల అదనపు కార్యదర్శి, శ్రీమతి పి. మాధవి దేవి గారు, గురుకుల డిప్యూటీ సెక్రటరీ (అక్కడమిక్), శ్రీ డి.ఎస్. వెంకన్న గారు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

* **అభివృద్ధికి కృషి చేస్తోన్న మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే**

బోధన్ పట్టణం, మే 21, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం టిటిడి కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అధ్యక్షత వహించారు. మొత్తం 120 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల కింద ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, ప్రతి అర్హుడు తగిన బెనిఫిట్లు పొందాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నామని తెలిపారు. రేషన్ బియ్యం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, మహిళల సంక్షేమ పథకాలు వంటి అంశాల్లో జవాబుదారీతనంతో అమలు జరుగుతోందని చెప్పారు. అలాగే, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును బాధ్యతగా వాడుకోవాలని, దానిని అమ్ముకోవద్దని సూచించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి కి సీఎం సానిహిత్యం వల్ల బోధన్‌కు ప్రత్యేక నిధులు పొందగలిగారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చేసిన కృషి వల్లే రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించిందని వివరించారు. కార్యక్రమ అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రగతి ప్రాజెక్టులో పెండింగ్ బిల్లుల పరిష్కారం కొరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, త్వరితగతిన వాటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఆదాయానికి రెట్టింపు వ్యయం




జరుగుతుందని, అందుకు గల కారణాలను విశ్లేషించి వాటి పరిష్కారానికి చర్యలు చూపాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలానికి ముందస్తు డ్రైనేజీ సమస్యలు, దోమల నివారణ చర్యలు వంటి అంశాలపై అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పిసిసి డెలిగేట్ గంగా శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, ఎమ్మార్వో విట్టల్, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, ఏసిపి శ్రీనివాస్, కల్దుర్కి సొసైటీ చైర్మన్ గింజుపల్లి శరత్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినుద్దీన్, కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు, తూము శరత్ రెడ్డి, అంకుదాము తదితర ప్రముఖులు, నాయకులు, ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం


# అదిలాబాద్ రూరల్ మండలం లో రాజర్షి షా సుడిగాలి పర్యటన

* **పలు గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా చేపట్టుతున్న పలు పథకాలను ద్విచక్ర వాహనంలో వెళ్లి పరిశీలన**
* **వేగవంతంగా పూర్తిచేసేందుకు పలు సూచనలు.**





ఆదిలాబాద్,, మే21 (సమయం న్యూస్) : బుధవారం అదిలాబాద్ రూరల్ లోని కచికంటి, చిట్యాల బోరిలలో జిల్లా పాలనాధికారి రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధి హామీ పనుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా చిట్యాల బోరి నుండి ఉపాదిపనులు చేస్తున్న ఫారెస్ట్ లోకి రెండు కీలో మీటర్లు బైక్ మీద వెళ్లారు. ఈ తనిఖీలో ఉపాధి హామీ కూలీల సంఖ్య ఎంత, ఉదయం ఎన్ని గంటలకు వస్తున్నారు, చేపడుతున్న పనులు ఎప్పటి నుండి చేస్తున్నారు, రహదారుల నిర్మాణాల కొలతలు, తదితర కూలీలతో మాట్లాడి, పనుల నాణ్యతను పరిశీలించి పనుల నాణ్యతను మెరుగుపరచాలని అన్నారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం తగ్గుతుందని, ప్రజల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఉపాధి హామీ పనిప్రదేశంలో పని చేసే వారి పేర్లనే మస్టర్లలో హాజరు వేసేలా మేట్ లు చూడాలని పేర్కొన్నారు. CCT "(నిరంతర కాంటౌర్ ట్రెంచ్" (Continuous Contour Trench) ఇది వ్యవసాయంలో నీరు , నేల సంరక్షణకు ఉపయోగించే ఒక పద్ధతి, కాంటౌర్ ట్రెంచింగ్ అని కూడా పిలుస్తారు. ఇది శుష్క ప్రాంతాలలో వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి కూడా ఉపయోగపడుతుందని) దీని ద్వారా భూమి కోతకు గురికాకుండా వర్షం నీరు భూమిలో ఇంకడానికి ఫారెస్ట్ ఏరియాలో చేస్తున్న పనుల తీరును పరిశీలించారు.

**నర్సరీలో పనుల పరిశీలన**

గ్రామ పంచాయతీ పరిధిలోని ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించి నర్సరీలో నాటిన మొక్కలకు ఉదయం, సాయంత్రం నీళ్లు పోసి, మొక్కలను బతికించాలని సూచించారు. ఈ ఏడాది సాధ్యమైనంతా తొందరగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కచికంటి లోని అంగన్వాడి కేంద్రం లో నిర్మిస్తున్న టాయిలెట్స్ నిర్మాణ పనులు పరిశీలించి అనంతరం కచికంటి గ్రామం లో ఓ ఇంట్లో వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణ పనులు పరిశీలించారు. వ్యక్తిగత ఇంకుడు గుంతలు ఒక ఇంటికి సంబంధించి ఆ ఇంటిలోనే నిర్మించే చిన్న గుంతలు. ఇవి ఇంటి పైకప్పు మీద పడే వర్షపు నీటిని భూమిలోకి ఇంకిపోయేలా చేస్తాయని, ఇంకుడు గుంతలు నిర్మించడం వల్ల భూగర్భ జల మట్టం పెరుగడం తోపాటు బోర్లు ఎండిపోకుండా ఉంటాయని, వర్షపు నీరు వృధా కాకుండా ఉంటుందన్నారు. బోర్లు ఎండిపోకుండా ఇంకుడు గుంతలు నీటి సంరక్షణకు దోహదపడతాయని, పర్యావరణాన్ని కాపాడతాయన్నారు. వ్యక్తిగత ఇంకుడు గుంతలు ఇంటి ఆవరణంలో, బోరు బావికి దగ్గరగా ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని భూమి వాలు ఉన్న చోట గుంతను నిర్మించడం వల్ల వర్షపు నీరు గుంతలోకి సులభంగా చేరుతుందని, గుంత నిర్మించేటప్పుడు పైన నీరునిల్వకుండా చూసుకోవాలన్నారు. ఇంకుడు గుంతలు కాలక్రమేణా అడుగు పట్టే అవకాశం ఉంటుందికాబట్టి, గుంతలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, గుంతల చుట్టూ గడ్డి, చెట్లు పెరగకుండా చూసుకోవాలని సలహాలు సూచనలు చేశారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తదనంతరం యాపల్ గూడ లోని రామాలయం ఆవరణలో SBM నిధులతో నిర్మించిన కమ్యూనిటీ టాయిలెట్ ను పరిశీలించారు. కలెక్టర్ వెంట drdo రవిందర్, ఎంపిడిఓ నాగేశ్వర్ రావు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



# బలగం సినిమా రిపీట్..

* **60 ఏళ్ల వయసులో పంతాలు విడిచి మాట్లాడుకున్న అన్నదమ్ముళ్లు..**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో అన్నదమ్ముళ్లు మామిండ్ల నాగయ్య, మామిండ్ల రాములు చిన్న చిన్న విబేదాలతో 10 ఏళ్ల కింద విడిపోయారు. ఒకే గ్రామంలో ఉన్నా అన్నదమ్ముళ్లు మాట్లాడుకోవడం లేదని, ఇద్దరిని ఎలా అయినా కలపాలని నాగయ్య కుమారుడు శ్రీనివాస్ ఎన్నో సార్లు ప్రయత్నించి విఫలమయ్యడు. ఇదిలా ఉండగా, నాలుగు రోజుల క్రితం ఒక రోడ్డు ప్రమాదంలో నాగయ్య, రామయ్యల మేనల్లుడు కూన తిరుపతి మరణించగా.. మూడు రోజుల కార్యానికి అన్నదమ్ముళ్లు ఇద్దరు హాజరయ్యారు. ఈ క్రమంలో ఇద్దరిని కలపాలని శ్రీనివాస్.. వారి పాత రోజులను, జ్ఞాపకాలను గుర్తు చేయడంతో ఇద్దరు కన్నీరు పెట్టుకున్నారు. ఆరు పదుల వయసులో, కాటికి వెళ్లే ముందు పంతాలు ఎందుకని.. ఇక నుండి అయినా కలిసి బ్రతుకుదామని, యోగ క్షేమలు అడిగి తెలుసుకొని ఆలింగనం చేసుకొని కంట తడి పెట్టుకున్నారు..

# మహిళలు స్వయం ఉపాధి తో ఆర్థిక ప్రగతి సాధించాలి

* **జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**



హనుమకొండ మే 21( సమయం న్యూస్) : మండల సమైక్య సంఘాల ద్వారా మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అభిప్రాయపడ్డారు. బుధవారం ఆత్మకూరు మండలం కేంద్రం లోని స్వర్ణ భారతి మండల సమైక్య ద్వారా పాఠశాలలకు యూనిఫాం అందించే యూనిఫామ్ తయారీ చేయు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సమైఖ్య సంఘాల మహిళలనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తి ద్వారా రోజుకు ఎనిమిది గంటలు పని దినములలో 24 పాఠశాలలకు చెందిన యూనిఫాంలు తయారుచేయడాన్ని ఆమె అభినందించారు. పాఠశాలలు తెరిచేనాటికి యూనిఫామ్‌లు తయారు చేయడం పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. మహిళలను గ్రూపుల వారిగా ఏర్పడి సమైక్యంగా ఏ పని చేపట్టినప్పటికీ విజయం సాధించడం తధ్యమని ఆమె అన్నారు. యూనిఫామ్ తయారు చేయడంలో మరింత వేగం పెంచి సకాలంలో దుస్తులు అందించే విధంగా మహిళలు కృషిచేయాలని ఆమె తెలిపారు. అనంతరం స్వర్ణ భారతి మండల సమైక్య కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఇక్కడ శిక్షణ పొందిన మహిళలకు ఉపాధి అవకాశం కల్పించేలా సంబంధిత కంపెనీలతో చర్చించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. హనుమకొండ జిల్లాలో ఉన్న పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని కంపెనీలో అవకాశం రాని మహిళలు నిరుత్సాహ పడవద్దు మండల సమైక్య సంఘాల ద్వారా మహిళలు స్వయం శక్తితో ఉపాధి పొందవచ్చునని జిల్లా కలెక్టర్ తెలిపారు. డిఆర్డిఓ మేనశ్రీను మాట్లాడుతూ మెగా టెక్స్టైల్ పార్కులో శిక్షణ పూర్తి అనంతరం ఉద్యోగ అవకాశాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందుకుగాను శిక్షణ కాలములో పూర్తి నైపుణ్యం పొందే విధంగా మహిళలు కృషి చేయాలని ఆయన తెలిపారు. ఉద్యోగ అవకాశాలు రానివారు నిరుత్సాహపడకుండా వారిని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ శ్రీనివాసరావు, డిప్యూటీ తాసిల్దార్ భాస్కర మూర్తి, ఎంపిఓ విమల, ఏపిఎం లలిత, మహిళా సమాఖ్యలు తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్..!

హైదరాబాద్: తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కు ప్రమాదం తప్పింది.. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ను అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. హుజూర్ నగర్ నియోజక వర్గంలో పలు లిఫ్టు ఇరిగేషన్ పనుల పరిశీలనకు హైదరాబాదు నుంచి ఆయన హెలికాప్టర్ లో బయలుదేరారు. ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం రావడంతో మేళ్ల చెరువులో దిగాల్సిన హెలికాప్టర్ కోదాడ లోనే అత్యవసరంగా ల్యాండ్ అయింది. వాతావరణ శాఖ అధికారుల సూచన మేరకు అత్యవసరంగా ల్యాండ్ అయినట్టు తెలుస్తోంది. అనంతరం, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ నుంచి హుజూర్ నగర్ కు రోడ్డు మార్గంలో వెళ్లి పోయారు..

# కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

* **రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి**




నల్గొండ మే 21(సమయం న్యూస్) :సౌర శక్తి వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి చేసి ఆదాయం సంపాదించుకునేందుకు దేశంలోనే మొట్టమొదటిసారిగా నల్గొండ జిల్లా, కట్టంగూరు మండలం, ఐటిపాములలో మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులతో సోలార్ బ్యాటరీ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, కట్టంగూరు మండలం, ఐటిపాములలో కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో స్వబాగ్స్ ల్యాబ్స్ ద్వారా ఏర్పాటుచేసిన "స్వచ్ఛ శక్తి ఆఫ్ గ్రిడ్ కో ఆపరేటివ్ సోలార్ బ్యాటరీ యూనిట్ల" ను ప్రారంభించడమే కాకుండా, స్వచ్ఛ శక్తి కేంద్రం, మహిళా సంఘాల మధ్య కుదిరిన ఒప్పంద పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మహిళను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళలనుకుంటే సాధించలేనిది ఇది లేదని,మహిళలు వంటింటికే పరిమితం కాదని అన్నారు. అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్ లాంటి దేశాలు న్యూక్లియర్ ,థర్మల్ విద్యుత్తును పక్కన పెట్టి సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి వెళుతున్నారని, దాన్ని దృష్టిలో ఉంచుకొని మహిళలు ఇంటి వద్దనుండే ఆదాయం పొందేందుకు సోలార్ విద్యుత్తు యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో మహిళలను లక్షాధికారులుగా చేయాలనే తలంపుతో ఆర్థిక సాయం అందించడం జరిగిందని, అదే సమయంలో తాను శాసనసభ్యుడిగా మహిళా స్వయం సహాయక సంఘాలకు 350 కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, స్వశక్తితో మహిళలు పైకి రావాలనే ఉద్దేశంతో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా 50 మంది స్వయం సహాయక మహిళలకు 50 లక్షల రూపాయలను ఇచ్చి యూనిట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు .అలాగే త్వరలోనే ఈ 50 మంది మహిళలకు బ్యాంకుల ద్వారా మూడు లక్షల రూపాయల చొప్పున బ్యాంకు రుణాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుద్యోగ యువతకు ఒక్కొక్కరికి నాలుగు లక్షల రూపాయలు చొప్పున జూన్ 2 న స్వయం ఉపాధి కై ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. రానున్న రెండు నెలల్లో ఐటిపాముల మాదిరిగానే నల్గొండ మండలం, చర్లపల్లి గ్రామంలో సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ రెండు గ్రామాలను తెలంగాణలోని ఇతర ప్రాంతాల వారు వచ్చి చూసే విధంగా తీర్చిదిద్దనున్నామని చెప్పారు. అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడమే కాకుండా, మహిళలు, అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఒక్కొక్కటి ఐదు లక్షల రూపాయలతో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల లో భాగంగా ఐటిపాములకు 100 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మహిళలకు 10 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. అంతేకాక స్వచ్ఛ శక్తి కేంద్రం ,మహిళా సంఘాల మధ్య కుదిరిన ఒప్పంద పాత్రాలను అందజేశారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ మహిళలు ఇంట్లో కూర్చుని సోలార్ విద్యుత్ యూనిట్ల ద్వారా నెలకి కనీసం 2000 రూపాయల ఆదాయం సంపాదించవచ్చన్నారు. ఐటిపాములలో ప్రభుత్వం ద్వారా కోటి రూపాయలపైనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, అంతేకాక అడిగిన వెంటనే రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి 100 కోట్ల రూపాయల ఐటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ను మంజూరు చేయించారని, పైపులైన్ పనులు వేగంగా జరుగుతున్నట్లు ఆయన వెల్లడించారు.70 కోట్ల రూపాయల తో మూసి వరకు కెనాల్ లైనింగ్ పనులు నడుస్తున్నాయని చెప్పారు. స్వచ్ఛ శక్తి కేంద్రం గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్తు యూనిట్లకు కోతుల బెడద లేకుండా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలోని 50 మంది మహిళలతో పాటు, ఇతరులను సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుపై ప్రోత్సహించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మహిళలు కాలు బయట పెట్టకుండా ఇంటి నుండే ఆదాయాన్ని సంపాదించేలా సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఐఓటి ద్వారా ఈ బ్యాటరీ చార్జింగ్ విషయాలను తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ సోలార్ విద్యుత్తు బ్యాటరీ జీవితకాలం సుమారు 10 సంవత్సరాలు ఉంటుందని, 3000 సైకిల్స్ ఈ బ్యాటరీ పని చేస్తుందని దశాబ్ద కాలం వరకు బ్యాటరీ మార్చాల్సిన అవసరం లేదని అన్నారు. సోలార్ విద్యుత్ బ్యాటరీ యూనిట్లను జాగ్రత్తగా భద్రపరచుకునే బాధ్యత మహిళలపై ఆధారపడి ఉందని, ముఖ్యంగా ప్రతికూల వాతావరణంలో జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. ఐటిపాములలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ బ్యాటరీలను ఇన్స్టిట్యూషనలైజేషన్ చేసేందుకు ముందుకు తీసుకెళ్తామన్నారు.


జగదీశ్


మల్లికార్జున్

# ఐఐటీహెచ్ డిస్టింగ్విష్‌డ్ ప్రొఫెసర్లకు అత్యున్నత గౌరవం

* **'ఫెలోస్ ఆఫ్ ద రాయల్ సొసైటీ'గా ఎంపిక**
* **ఇద్దరివీ తెలుగు రాష్ట్రాల మూలాలే**

సంగారెడ్డి టౌన్ : ఐఐటీహెచ్ డిస్టింగ్విష్‌డ్ ప్రొఫెసర్లు చెన్నుపాటి జగదీశ్, తాటిపాముల మల్లికార్జున్‌లను ప్రతిష్ఠాత్మక పురస్కారాలు వరించాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విశేష కృషి చేసినందుకు వీరిద్దరూ ఈ ఏడాదికి 'ఫెలోస్ ఆఫ్ ద రాయల్ సొసైటీ'గా ఎంపికయ్యారు. తెలుగు రాష్ట్రాల మూలాలున్న ఇద్దరు ఎంపిక కావడం విశేషం. ప్రొఫెసర్ జగదీశ్ స్వగ్రామం కృష్ణా జిల్లా వల్లూరుపాలెం. ప్రస్తుతం ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈయనను గతంలోనూ పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు వరించాయి. టెలికమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులే లక్ష్యంగా ముందుకు సాగుతున్న డా.తాటిపాముల మల్లికార్జున్ కూడా ఎఫ్ఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన వరంగల్‌లో జన్మించారు. ప్రస్తుతం స్వీడన్‌కు చెందిన ఎరిక్షన్ కంపెనీ చీఫ్ టెక్నికల్ అధికారిగా పనిచేస్తున్నారు. ఐఐటీహెచ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారిద్దరూ వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి ప్రత్యక్షంగా పాల్గొని సంతోషాన్ని పంచుకున్నారు. "యువత ఏ రంగాన్ని ఎంచుకున్నా ఉత్సాహంగా పనిచేయడం ముఖ్యం. అప్పుడే మెరుగైన ఫలితాలు సాధ్యం. వాతావరణ మార్పులు, ఎనర్జీ ట్రాన్సిషన్, ఆరోగ్యం, ఆహార భద్రత వంటి అంశాల్లో ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలు చూపడం లక్ష్యం కావాలి" అని జగదీశ్ పేర్కొన్నారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక





సీతంపేట మండలం సోమరెల్లి గ్రామంలో జరిగిన గ్రామ దేవత ఉత్సవాలలో పాల్గొన్న పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ

- సీతంపేట, మే 21, సమయం న్యూస్

# కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల ప్రజా ధనం దుర్వినియోగం

* గత పాలకుల తీరుతో పదేళ్లు కృష్ణ నది జలాల పంపకాలలో తెలంగాణ కి అన్యాయం జరిగింది...
* మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ల ద్వారా 71000 ఎకరాలకి సాగు నీరు.....
* ఇరిగేషన్ స్కీం లలో భూ సేకరణచెసిన వెంటనే నష్ట పరిహారం....
* చింతలపాలెం మండలం లో మూడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం లకి భూ సేకరణ జులై నాటికి పూర్తి చేయాలి.....
* ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ కి ఇందిరా గాంధీ ఎత్తిపోతల పథకం గా నామ కరణం.......
* రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి
* నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



సూర్యాపేట జిల్లా మే21(సమయం న్యూస్) : కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయిందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం చింతలపాలెం మండలం అంజలి సిమెంట్ ఆడిటోరియం లో రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం,ముక్త్యాల బ్రాంచ్ కెనాల్,నక్క గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ల పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ కృష్ణా నది జలాల పంపకం లో బ్రిజేష్ ట్రిబ్యునల్ పై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తో దక్షిణ తెలంగాణా ఎడారి లాగా మారిందని తెలిపారు. తెలుగురాష్ట్రాలకి 811 టి యమ్ సి లు కేటాయించగా 512 టి యమ్ సి(66%) లు ఆంధ్రకి 299 టి యమ్ సి లు (34%) తెలంగాణ కి అని జరిగిన లిఖిత పూర్వక ఒప్పందంపై గత పాలకులు ఒప్పుకొని తెలంగాణకి తీవ్ర అన్యాయం చేసారని మన ప్రజా ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రిగా నేను నిపుణులు, న్యాయ కోవిద్దుల సలహాలు తీసుకొని కృష్ణ జలాల పంపకం లో 70 % తెలంగాణకి తీసుకొచ్చేలా కేసు రిఓపెన్ చేపించి ట్రిబ్యునల్ కి ఇరిగేషన్ మంత్రిగా స్వయంగా హాజరై వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి కి కృష్ణ జలాలలో నీరు కేటాయించకపోయినా గత ప్రభుత్వం నిష్టబంగా ఉందని మేము వచ్చాక నీటి కేటాయింపు కోసం పోరాడుతున్నామని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 38,000 కోట్లతో తుమ్మిడి హట్టి వద్ద డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవ్వెళ్ల ప్రాజెక్ట్ పనులు మొదలు పెట్టగా దానిని రద్దు చేసి మెడిగడ్డ పదేళ్లు కాళేశ్వరం పేరుతో కాలయాపన చేస్తూ లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయిందని అవే నిదులతో కృష్ణ నది పై భీమా, నెత్తంపాడు, కోయిల సాగర్, కల్వకుర్తి, డిండి, ఎస్ ఎల్ బి సి టన్నెల్ అలాగే గోదావరి పై దేవదుల, సీతారామ ప్రాజెక్టు లు పూర్తి అయ్యేవని మంత్రి తెలిపారు. నక్కగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ పై మాట్లాడుతూ 2008 లో పనులు మొదలు పెట్టి 2012 లో పూర్తి చేసి రైతులకి సాగునీరు అందజేసామని 2018 నుండి మరమ్మత్తు లు చేపించకుండా పక్కన పెట్టడంతో రైతులు ఇబ్బంది పడ్డారని మరల మన ప్రభుత్వం హయాంలో 37.70 కోట్ల రూపాయలతో నక్కగూడెం, చింత్రియాల, కిష్టపురం, తమ్మారం 3200 ఎకరాలు సాగులోకి వస్తుందని 2025 ఆగస్టు నాటికి పూర్తి చేయాలనీ ఆదేశించారు. భూమికింద వేసిన పైపులు కి కుడా రైతులకి నష్ట పరిహారం ఇచ్చామని తెలిపారు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకి ఇందిరాగాంధీ ఎత్తిపోతల పథకం గా నామకారణం చేయటం జరిగిందని ఈ స్కీం ద్వారా 1450 కోట్ల రూపాయలతో మఠంపల్లి మండలంలో 20500 ఎకరాలు, మేళ్లచెర్వు మండలంలో 15800 ఎకరాలు, చింతలపాలెం మండలంలో 16700 ఎకరాలు మొత్తం 53000 ఎకరాలు సాగు లోకి తీసుకొని రావటం జరుగుతుందని 2026 ఆగస్టు నాటికో పూర్తి చేయాలనీ కాంట్రాక్టర్ ని ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా నాగార్జున సాగర్ లో నీరు లేకపోయినా కృష్ణ నది నుండి నీరు ముక్త్యాల కాల్వలో నీరు ఎత్తిపోసి రైతులకి సాగు నీరు అందించటం జరుగుతుందని తెలిపారు. రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ను 394 కోట్ల రూపాయలతో మేళ్లచెర్వు, కోదాడ, హుజూర్ నగర్, చింతలపాలెం, చిలుకూరు మండలాల పరిధిలోని 12 గ్రామాలకి చెందిన 14100 ఎకరాలు సాగులోకి తేవటం జరుగుతుందని 2026 మే నాటికి పూర్తి చేసి అందుబాటులో కి తేవాలని కాంట్రాక్టర్ ని ఆదేశించారు. ఈ మూడు స్కీం ల్ ద్వారా 71000 ఎకరాలు సాగులోకి రావటం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఇరిగేషన్ పథకాలకి సంబంధించి భూ సేకరణ చేస్తే రైతు కి న్యాయ బద్దంగా వెంటనే నష్ట పరిహారం అందజేయటం జరుగుతుందని తెలిపారు. ఈ మూడు లిఫ్ట్ ఇరిగేషన్ లకి సంబంధించి భూ సేకరణకి రైతులు సహకరించాలని, స్థానిక ప్రజా ప్రతి నిధులు కుడా ప్రజలకి తెలియజేయాలనీ సూచించారు. పెండింగ్ లో ఉన్న భూ సేకరణ పనులు పూర్తి చేయాలనీ కలెక్టర్ ని, ఆర్డివో లకి తెలిపారు. ఎక్కడైనా లిఫ్ట్ ఇరిగేషన్ లకి మరమ్మత్తులు ఉంటే అధికారులకి తెలియజేయాలనీ సూచించారు. తదుపరి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం లకి సంబంధించిన రైతుల నుండి భూ సేకరణ పనులు పూర్తి చేసి , నష్టపరిహారం అందజేసి ఇరిగెషన్ అధికారులకు అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఇరిగేషన్ సి ఈ రమేష్ బాబు, ఎస్ ఈ శివ ధర్మ తేజ, డి ఈ లు చారి, హరి కిషోర్, తహసీల్దార్ సురేందర్ రెడ్డి, ఎంపిడిఓ భూపాల్ రెడ్డి, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## డిసిల్టింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయండి

: బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే
* నయీం నగర్ నాలా, మంగలి వాగు నాలాల పరిశీలన...

వరంగల్ కార్పొరేషన్ మే 21(సమయం న్యూస్) : నాలల డిసిల్టింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధ వారం సాయంత్రం హనుమకొండ పరిధిలోని నయీమ్ నగర్ నాల, మంగలి వాగు బ్రిడ్జి నాలాలను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి డిసిల్టింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయుటకు ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు విస్తృతంగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో హనుమకొండ పరిధిలో వెంటనే డిసిల్టింగ్ ప్రక్రియను చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని, భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో నీరు సాఫీగా వెళ్లిపోవడానికి వీలుగా హిటాచి ల ద్వారా పూడిక తీత ప్రక్రియ చేపట్టి ఎలాంటి ఆటంకాలు లేకుండా వరదనీరు సాఫీగా వెళ్ళిపోయేలా ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నాలాల్లో పూడికతీత ప్రక్రియ వేగవంతంగా పూర్తి కావడానికి కృషి చేయాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ రాజకుమార్ ఏఈ హరికుమార్ వర్క్ ఇన్స్పెక్టర్లు హరికృష్ణ రఘు తదితరులు పాల్గొన్నారు

## టీమ్స్ ఆస్పత్రి నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేయండి

హైదరాబాద్ మే21 (సమయం న్యూస్) : ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టీనా చొంగ్తు తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) సనత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి నిర్మాణం పనులను వేగవంతం చేసేందుకు మరియు ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను త్వరితగతిన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టీనా చొంగ్తు, రోడ్లు మరియు భవనాల శాఖ కార్యదర్శి హరిచందన దాసరి అన్నారు. ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు బుధవారం సీనియర్ అధికారులు టిమ్స్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి, పురోగతిని సమీక్షించారు. ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టీనా చొంగ్తు, రోడ్స్ అండ్ బిల్డింగ్స్ శాఖ కార్యదర్శి హరిచందన దాసరి నేతృత్వంలో ఈ సందర్శన జరిగింది. నిమ్స్, కిమ్స్, యశోద, ఏఐజీ హాస్పిటల్స్ నుండి సీనియర్ వైద్య నిపుణులు, నిర్వాహకులు క్లినికల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్‌కు సంబంధించి కీలక సూచనలు అందించారు. నిర్మాణ స్థలంలో సమగ్ర పరిశీలన అనంతరం, మిగిలిన పనులను వేగవంతం చేయడానికి, శాఖల మధ్య సమన్వయం పెంపొందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. కార్డియాక్, కార్డియోథొరాసిక్ సర్జరీ, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సైన్సెస్‌లో టిమ్స్ సనత్‌నగర్‌ను అత్యాధునిక టెర్షియరీ కేర్ సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు ఉన్నత వైద్య సేవలు అందించేందుకు నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షా లో జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ ముకుంద రెడ్డి, వైద్య విద్య శాఖ డైరెక్టర్ (డీఎంఈ), టిమ్స్ నోడల్ అధికారితో పాటు రోడ్స్ అండ్ బిల్డింగ్స్ శాఖ, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్, సాంకేతిక బృందాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## నకిలీ విత్తనాలు అరికట్టడానికి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు


పెద్దపల్లి మే 21(సమయం న్యూస్): జిల్లాలో నకిలీ విత్తనాలు అరికట్టడానికి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో సహాయ వ్యవసాయ సంచాలకులు పెద్దపల్లి ,విత్తన ధ్రువీకరణ అధికారి కరీంనగర్, మరియు పోలీస్ అధికారి కమాన్పూర్ లతో విత్తన తనిఖీ కొరకు టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగినది. వీరు నిరంతరం 24/7 అందుబాటులో ఉంటారు రైతులు ఎవరైనా బిజీ III పత్తి విత్తనాలు,HT పత్తి విత్తనాలు రాత్రి వేళల్లో గ్రామాల్లో తిరిగి అమ్మే విత్తనాల గురించి సమాచారం తెలిస్తే ఈ క్రింది అధికారులకు సమాచారం అందించి గలరు. వారి వివరాలు గోప్యంగా ఉంచబడును మరియు నకిలీ విత్తనాలు అరికట్టడంలో ఎవరైనా తమకు తెలిసిన సమాచారం ఉంటే అందించి రైతు సంక్షేమానికి తోడ్పడగలరని ఆశిస్తున్నాము.

**టాస్క్ ఫోర్స్ కమిటీ**

1. వ్యవసాయ శాఖ:శ్రీ ఎం శ్రీనాథ్ సహాయవ్యవసాయ సంచాలకులు, పెద్దపల్లి ,సెల్ నెంబర్.8977752820
2. విత్తన ధ్రువీకరణ సంస్థ: శ్రీ వై సునీల్ విత్తన ధ్రువీకరణ అధికారి, కరీంనగర్, సెల్ నెంబర్ 7288879682, 7799011929.
3. పోలీస్ శాఖ: శ్రీమతి జె రవళి పోలీస్ఆఫ్ కమాన్పూర్ సెల్ నెంబర్:9550279233, 8712575504.

# మహబూబాబాద్ జిల్లాలో విత్తన వ్యాపారులకు అవగాహన సదస్సు

మహబూబాబాద్, మే 21,( సమయం న్యూస్) మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ,అధ్యక్షతన, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయ నిర్మల ఆధ్వర్యంలో విత్తన వ్యాపారులకు అవగాహన సదస్సు మహబూబాబాద్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించబడింది. ఈ సదస్సులో విత్తన చట్టాలు మరియు నిబంధనలపై విత్తన వ్యాపారులకు అవగాహన కల్పించడం జరిగింది. జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయ నిర్మల, ఎ.ఓ. టెక్నికల్ శ్రీ జి. విజ్ఞాన్ గార్లు విత్తన చట్టాలు, నియమాలు మరియు వ్యాపారులు పాటించవలసిన మార్గదర్శకాలను వివరించారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ , పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ మరియు రెవెన్యూ శాఖలతో కూడిన విత్తన టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటును ప్రతిపాదించారు. "చట్టాన్ని ఉల్లంఘించడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. అందుకే సీజన్ ప్రారంభానికి ముందు ఈ అవగాహన సదస్సు నిర్వహించాము. విత్తన వ్యాపారులు అన్ని నియమాలను కచ్చితంగా పాటించాలి" అని ఆయన స్పష్టం చేశారు. నిల్వ మరియు విక్రయ కేంద్రాలలో రెగ్యులర్ తనిఖీలు నిర్వహించబడతాయని కూడా ఆయన తెలిపారు. ప్రభుత్వం నకిలీ విత్తనాల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించవద్దని కఠిన ఆదేశాలు జారీ చేసింది. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం కోసం అందరూ కఠినంగా కృషి చేయాలి. నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు, ఇది ఆమోదయోగ్యం కాదు. విత్తన వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి మరియు రైతులకు నమ్మకమైన విత్తనాలను మాత్రమే అందించాలి. జిల్లాలో విత్తనాల నాణ్యతను నిర్ధారించడానికి టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తాయి. చట్టవిరుద్ధ కార్యకలాపాలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోబడతాయి" అని హెచ్చరించారు. (రెవెన్యూ) గత సీజన్‌లో జరిగిన ఉల్లంఘనల గురించి వివరిస్తూ, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వ్యాపారులను హెచ్చరించారు. "చాలా మంది రైతులు నకిలీ విత్తనాల గురించి ఫిర్యాదు చేస్తూ మా కార్యాలయాన్ని సంప్రదించారు. ఇటువంటి సంఘటనలు ఇకపై జరగకూడదు. అందరం రైతుల శ్రేయస్సు కోసం కృషి చేయాలి" అని ఆయన అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి విజయ నిర్మల గారు వ్యాపారులు నిర్వహించవలసిన కార్యకలాపాలు, నిర్వహించాల్సిన రికార్డుల గురించి వివరించారు. ఎ.ఓ. టెక్నికల్ శ్రీ జి. విజ్ఞాన్ గారు 1966 విత్తన చట్టం, 1983 విత్తన నియంత్రణ ఉత్తర్వు మరియు 1971 విత్తన నియమాలను వివరంగా వివరించారు. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు, పీడీ యాక్ట్ గత సంవత్సరం వివిధ విత్తన చట్టాల కింద నమోదైన కేసుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అండ్ సీరికల్చర్ అధికారి మరియన్న, డీసీఓ వెంకటేశ్వర్లు, డీఎం మార్క్‌ఫెడ్ , శ్యామ్, మహబూబాబాద్ ఏడీఏలు విజయ్ చంద్ర,ఎ. శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏడీఏ, మహబూబాబాద్ మండలాల మాండల వ్యవసాయ అధికారులు, మహబూబాబాద్ విత్తన వ్యాపారులు పాల్గొన్నారు.




## క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందానికి అభినందనలు

- జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్

పెద్దపల్లి, మే 21(సమయం న్యూస్): క్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా జిల్లా ఆసుపత్రిలో నిర్వహించినందుకు గాను వైద్య బృందాన్ని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ అభినందిస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత 4 సంవత్సరాలుగా గర్భ సంచిలో గడ్డ తో ఇబ్బంది పడుతున్న మైనారిటీ మహిళకు. నేడు రక్తహీనత మరియు ఫిట్స్ ఉన్న విజయవంతంగా డాక్టర్ అనసూయ, డాక్టర్ శ్రీధర్ డా షౌరయ్య నిర్వహించారని ఆయన తెలిపారు. ఇలాంటి శాస్త్ర చికిత్సలు



పెద్దపల్లి మాత శిశు హాస్పిటల్ లో నిర్వహిస్తున్నామని ,అవసరం ఉన్న ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు వివిధ రకాల స్పెషలిస్ట్ సేవలు, శస్త్ర చికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయని, అవసరమైన ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజను నిర్వహించిన మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే

* **నిరుపేదల సొంత ఇంటి కలను నిజం చేసే ప్రయత్నంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టింది.**
* **బోధన్ పట్టణంలో మొదటి విడతగా 600 మంది నిరుపేదలకు ఇళ్ల మంజూరు.**
* **డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయాలతో వెసులుబాటును ఉపయోగించుకోవాలి.**









బోధన్ పట్టణం, మే 21, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని మున్సిపల్ పరిధిలో 600 మంది లబ్ధిదారులకు తొలి విడతగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో వార్డు నెంబర్ 11 రాకాసిపేట్, 15 పాన్ గల్లి, 23 శక్కర్ నగర్ ప్రాంతాల్లో భూమి పూజ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పది సంవత్సరాల పాలకులు నిరుపేదల ఇంటి కలను వాగ్దానాలకే పరిమితం చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ మంత్రి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో నిజమైన సంకల్పంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల నిధులు విడతలుగా మంజూరవుతాయని చెప్పారు. డబ్బులకు ఇబ్బందిగా ఉన్నవారు రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా రుణాలను అందించడంతో, సంఘంలోని సభ్యులు అట్టి రుణాన్ని ఇంటి నిర్మాణాలకు ఉపయోగించుకొనే వెసులుబాటు కల్పిస్తూ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాలని, మిగిలిన నిధులు ప్రభుత్వం నుంచి విడతలుగా విడుదలవుతాయని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఆలస్యం చేయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పిసిసి డెలికేట్ గంగా శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ తూము పద్మశారత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, ఎమ్మార్వో విట్టల్, ఎసిపి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినుద్దీన్, కాంగ్రెస్ ప్రముఖ నాయకులు నాగేశ్వరరావు, తూము శరత్ రెడ్డి, అంకుదాము, హరికాంత్ చారి, మీర్ నజీర్ అలీ, కర్నే హనుమంతరావు, గుండెటి రాములు, నరేందర్, యువ నాయకులు తల్లారి నవీన్, విష్ణువర్ధన్, చిత్రాల ప్రమోద్ (చిన్ను), సాయి, సాజిద్ బడు, శ్రీనివాస్ తదితర ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# అక్రమ మట్టి తరలిస్తున్న వారిపై కేసు నమోదు

* **సిఐ రవీందర్ రెడ్డి**

జిన్నారం, మే 21, సమయం న్యూస్ : అక్రమ మట్టి తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్టు బొల్లారం సిఐ రవీందర్ రెడ్డి బుధవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో, ప్రభుత్వ సర్వే నంబర్ 79 లోనుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, రెవెన్యూ సిబ్బంది సమాచారం ఇవ్వడం జరిగింది. ఈ మేరకు ఈనెల 20వ తేదీ రాత్రి 12 నుండి 1:00 మధ్య సమయంలో సందర్శించగా, ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వుతున్న రెండు జెసిబిలను, రెండు టిప్పర్ లారీలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. జెసిపి ,టిప్పర్ లారీల యజమానులు, డ్రైవర్ల పై కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ రవీందర్ రెడ్డి తెలిపారు.






# రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి
## 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.3000 జరిమానా విధించిన న్యాయస్థానం

బోధన్ పట్టణం, మే 21, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి 3 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ బోధన్ న్యాయస్థాన సముదాయములోని మొదటి అదనపు జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టు కీలక తీర్పును బుధవారం ప్రకటించింది. న్యాయమూర్తి ఈ. సాయి శివ తీర్పు ప్రకారం, మోహమ్మద్ సుమేర్ ఖాన్ మరియు మోహమ్మద్ అర్బాజ్ అనే నిందితులకు రూ.3000 జరిమానాతో పాటు 3 సంవత్సరాల కారాగార శిక్షను విధించారు. ఈ ఘటనలో నిందితులు AP25X 8808 నంబర్ వాహనంలో ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిజామాబాద్ నుండి బోధన్ వైపు రవాణా చేస్తుండగా, ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జానకంపేట్ వద్ద అప్పటి ఎస్ఐ బాబు వారిని అరెస్ట్ చేశారు. తదుపరి దర్యాప్తులో మాజి ఎస్ఐ బాబు సేకరించిన సాక్ష్యాధారాలను ఆధారంగా తీసుకొని, కోర్టు నిందితులను దోషులుగా నిర్ధారించింది. న్యాయస్థానం తీర్పు మేరకు ప్రస్తుత ఎస్ఐ వంశీకృష్ణ రెడ్డి నేరస్థులపై చర్యలు చేపట్టారు. ఈ తీర్పు ప్రజా పంపిణీ వ్యవస్థను దుర్వినియోగం చేసే వారందరికీ గుణపాఠంగా నిలుస్తుందని న్యాయవర్గాలు వ్యాఖ్యానించాయి. న్యాయవ్యవస్థ ప్రజలకు న్యాయం చేస్తుందని, అక్రమాలకు తగిన శిక్షలు తప్పవని ఈ తీర్పు స్పష్టమైన సందేశం ఇస్తోంది.

# జిల్లా ప్రజలు వర్షాలు ఐరామట్టంగా ఉండాలి

* **జిల్లా ప్రజలకు పలు సూచనలిచేసిన జిల్లా కలెక్టర్**

రిజ్వాన్ షేక్ బాషా.



జనగాం మే21( సమయం న్యూస్) : రానున్న రెండు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. చెరువులు కాలువల వద్ద జాగ్రత్తగా ఉండాలని.. వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద ఉండరాదన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని... ఏమైన ఇబ్బందులు ఎదురయ్యాయని తమ దృష్టి కి వస్తే వెంటనే స్పందించాలన్నారు. ధాన్యం కుప్పలు తడవకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు



# టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్ మే,21(సమయం న్యూస్) : తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఈ నెల 31న జలవిహార్ లో నిర్వహిస్తున్న రజతోత్సవాల పోస్టర్ ను బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్ లో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, టీజే ఎఫ్ వ్యవస్థాపక సభ్యుడు ఎ.రమణ కుమార్, టీయూ డబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి పి.యోగానంద్, సహాయ కార్యదర్శి యార నవీన్ కుమార్, ఐజేయు నేత అవ్వారి భాస్కర్, టీయూడబ్ల్యూజే హైదరాబాద్ నగర అధ్యక్ష, కార్యదర్శులు రాకేష్ రెడ్డి, సోమేశ్, కోశాధికారి బాబు రావులు పాల్గొన్నారు.

# ఎడపల్లిలో రోడ్డు ప్రమాదం – బైక్ సవారీదారుడు మృతి






ఎడపల్లి మండలం, మే 21, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గం ఎడపల్లి మండలంలో బుధవారం ఉదయం దురదృష్టకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చాపరాల రాజశేఖర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, ఆయన బావమరిది నిమ్మగడ్డ రమేష్ (57) ఎడపల్లి గ్రామ శివారులోని సరయు ఫంక్షన్ హాల్ వద్ద బైక్‌తో యు టర్న్ తీసుకుంటుండగా, నిజామాబాద్ నుండి బోధన్ వైపు అతివేగంగా వచ్చిన TS 16 EY 9473 నంబర్ గల కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది అని, ఈ ఘటనలో రమేష్ తీవ్రంగా గాయపడి, ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయాడు అని, కారు డ్రైవర్ రాజేష్ అజాగ్రత్తగా వాహనం నడిపినందునే ఈ ప్రమాదం జరిగిందని రాజశేఖర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని బోధన్ లోని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారు బంధువులకి అప్పగించారు . అలాగే మృతుడు నిమ్మగడ్డ రమేష్ కళ్ళను వారి కుటుంబ సభ్యులు లయన్స్ ఐ హాస్పిటల్ కి దానం చేసినట్లు లయన్స్ ఐ హాస్పిటల్ నిర్వాహకులు బసవేశ్వర రావు తెలిపారు.

# నూతన సమాచార కమిషనర్‌గా వైష్ణవి ప్రమాణ స్వీకారం

హైదరాబాద్: నూతన సమాచార కమిషనర్‌గా వైష్ణవి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని ఆర్‌టీఐ కార్యాలయంలో రాష్ట్ర సమాచార కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సహ సమాచార కమిషనర్లు ఆమెను అభినందించారు. ఇప్పటికే నలుగురు సమాచార కమిషనర్లు బాధ్యతలు స్వీకరించగా తాజాగా వైష్ణవి బాధ్యతలు చేపట్టారు.



# కలెక్టరే పెళ్లి పెద్ద.. అధికారులే బంధువులు...

* **పెద్దపల్లి కలెక్టరేట్‌లో ఘనంగా అనాథ యువతి వివాహం**




పెద్దపల్లి కలెక్టరేట్: జిల్లా అధికార యంత్రాంగం ముందుండి ఓ అనాథ యువతి వివాహాన్ని ఘనంగా జరిపించింది. జిల్లా కలెక్టరే పెళ్లి పెద్దగా మారారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులంతా బంధువులయ్యారు. వివాహానికి పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ వేదికైంది. 16 ఏళ్ల కిందట తల్లిదండ్రులను కోల్పోయిన నక్క మానస, ఆమె చెల్లెలు లక్ష్మిలను రామగుండం తబిత బాలల సంరక్షణ కేంద్రం నిర్వాహకులు వీరేందర్‌నాయక్, విమల దంపతులు చేరదీశారు. వారి సంరక్షణలోనే మానస డిగ్రీ, లక్ష్మి ఇంటర్ పూర్తి చేశారు. ఇటీవల జనగామ జిల్లా రఘునాథపల్లికి చెందిన రాజేశ్‌తో మానస వివాహం నిశ్చయమైంది. పెళ్లి జరిపించడానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష ముందుకొచ్చారు. ఆయన పేరిటే ఆహ్వాన పత్రికలు ముద్రించారు. అవసరమైన సామగ్రిని అధికారులు సమకూర్చారు. బుధవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఆవరణలో పెళ్లి ఘనంగా జరిగింది. కలెక్టర్ శ్రీహర్ష ముందుండి వివాహ కార్యక్రమం మొత్తం నడిపించారు. తబిత బాలల సంరక్షణ కేంద్రం నిర్వాహకులు వీరేందర్‌నాయక్, విమల దంపతులు కన్యాదానం చేశారు. పెళ్లి అనంతరం వధూవరులు కలెక్టర్ ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణారావు, అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీసీపీ కరుణాకర్, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బొంకూరు శంకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. టీఎన్జీవోల ఆధ్వర్యంలో మానసకు రూ.61,800 చెక్కు అందజేశారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం



# సినిమా





# చాన్స్‌ల వేట

పదిహేనేండ్ల వయస్సుల్లోనే తెరంగేట్రం చేసిన భామ తమన్నా భాటియా. దాదాపు 20 ఏండ్లుగా పరిశ్రమలో రాణిస్తోందీ అమ్మడు. అందం, అభినయంతో దక్షిణాది ప్రేక్షకులను కట్టిపడేసిందీ బ్యూటీ. అలారెండు దశాబ్దాల మైలు రాయిని అవలీలగా టచ్ చేసింది. ఇప్పుడీ అమ్మడి వయస్సు 35 ఏండ్లు. జైలర్ చిత్రం, ఆ తరువాత హిందీ స్త్రీ2 వంటి చిత్రాలలో తమన్నా స్పెషల్ సాంగ్స్‌తో ఇరగదీసింది. అలాంటి మిల్కీబ్యూటీకి దక్షిణాదిలో ఒక్కటంటే ఒక్క సినిమా లేదు. ఇటీవల సుందర్ సీ దర్శకత్వంలో నటించిన అరణ్మణై - 4 చిత్రం కమర్షియల్‌గా మంచి విజయాన్ని అందుకుంది. ఆ తరువాత కోలీవుడ్‌లో మరో అవకాశం రాలేదు. తెలుగులో నటించిన ఓదెల - 2 చిత్రం పూర్తిగా నిరాశ పరిచింది. దీంతో అక్కడ మరో అవకాశం రాలేదు. అలా దక్షిణాది చిత్ర పరిశ్రమ తమన్నాను పూర్తిగా పక్కన పెట్టేసిందా? అన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతం బీ టౌన్ నే నమ్ముకుందీ అమ్మడు. అక్కడ కూడా ఒకటి రెండు సినిమాలు మాత్రమే చేతిలో ఉన్నాయి. తమన్నా కన్నా వయసులో పెద్ద వారైన నయనతార, త్రిష వంటి తారలు నాలుగు పదుల వయసు దాటేసినా ఇప్పటికీ అగ్ర కథానాయకిలుగా రాణిస్తున్నారు. మిల్కీబ్యూటీ కెరీర్ పై లవ్ ఫెయిల్యూర్ ఎఫెక్ట్ ఉందనే టాక్ వినిపిస్తోంది. విజయ్ వర్మ అనే హిందీ నటుడి ప్రేమలో పడడం, అది కొద్ది కాలానికే వికటించడం వంటి ఘటనలు కెరీర్‌ను దెబ్బతీశాయంటున్నారు. ఏదేమైనా మిల్కీ బ్యూటీ మళ్లీ అవకాశాల వేటలో పడింది. తన గ్లామరస్ ఫోటోలతో ఇన్‌స్టాలో సందడి చేస్తోంది.

# ముత్యమల్లె మెరిసిపోయే..

హే.. ముత్యమల్లే మెరిసిపోయే మల్లెమొగ్గా.. అరె ముట్టుకుంటే ముడుసుకుంటావ్ ఇంత సిగ్గా అన్నారో సినీ కవి. కేన్స్ 2025 వేదికపై అతిలోక సుందరి శ్రీదేవి తనయ జాన్వీకపూర్ అలా మెరిసిపోతోంది. మొట్టమొదటి సారి జాన్వీ కపూర్ కేన్స్ లో ఆరంగేట్రం చేసింది. కేన్స్ లో తాను నటించిన 'హోమ్ బౌండ్' స్క్రీనింగ్ లో ఈ అద్భుతమైన లుక్ తో కనిపించింది. జాన్వీ ఈ కొత్త రూపంతో మతులు చెడగొడుతోంది. చూడటానికి కొంచెం సింపుల్ గా ఉన్నా కానీ, ముత్యాలు బీడ్స్ తో ఈ పొడవాటి లెహంగాను సర్వాంగ సుందరంగా డిజైనర్ మలిచారు. ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిలియాని దీనిని డిజైన్ చేసారు. ఈ లుక్ లో గ్రేస్ ఉంది. గ్లామర్ ని సంప్రదాయ బద్ధంగా ఎలివేట్ చేసే నైపుణ్యం కనిపించింది. ధడక్ తో ఆరంగేట్రం చేసిన జాన్వీ సహనటుడు ఇషాన్ ఖట్టర్ కూడా కేన్స్ 2025లో సందడి చేస్తుండడం విశేషం. అతడు విశాల్ జెత్వా కూడా జాన్వీతో పాటు కేన్స్ లో సందడి చేస్తూ కనిపించారు. ఈ ముగ్గురూ కేన్స్ 2025 లో 'హోమ్ బౌండ్' ప్రపంచ ప్రీమియర్ కోసం ఆత్రుతగా కనిపించారు. ఈ ఉత్సవాల్లో జాన్వీ కపూర్ గురూజీ, ప్రముఖ దర్శకనిర్మాత కరణ్ జోహార్ కూడా ఉన్నారు.

# అందానికి పట్టాభిషేకం..

## 31 ఏళ్ల క్రితం ఫొటో షేర్ చేసిన సుస్మితాసేన్





సరిగ్గా 31 ఏళ్ల క్రితం మే 21న ప్రపంచమంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నవేళ సుస్మితాసేన్ అందాల కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. భారత్ తరఫున తొలిసారి విశ్వసుందరి కిరీటాన్ని దక్కించుకొని చరిత్ర సృష్టించారు. అందుకే తన జీవితంలో మే 21 ఎప్పటికీ ప్రత్యేకమే అంటారు నటి సుస్మిత. నేడు మరోసారి ఆ రోజులను గుర్తుచేసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు. '' భారతదేశానికి చెందిన 18 ఏళ్ల అమ్మాయిని విశ్వానికి పరిచయం చేసిన చరిత్రాత్మక విజయం అది. ఆశకు మరింత బలాన్నిస్తూ.. ప్రేమను మరింత ముందుకునడిపిన రోజు. ప్రపంచమంతా పర్యటించడానికి జీవితంలో స్ఫూర్తినింపే ఎంతోమంది వ్యక్తులను కలిసే భాగ్యాన్ని పొందిన రోజు. ఈ విషయంలో దేవుడికి, మా అమ్మకు ఎప్పటికీ కృతజ్ఞతలు చెబుతూనే ఉంటాను. మిస్ యూనివర్స్ పోటీల్లో భారతదేశం తొలిసారి విజయం సాధించి 31 ఏళ్లు అయింది. ఈ సందర్భంగా అందరికీ నా శుభాకాంక్షలు. నా దేశానికి ప్రాతినిధ్యం వహించే గౌరవం లభించినందుకు ఎప్పటికీ గర్వంగా ఉంటాను. పెద్ద కలలు కనండి.. వాటిని సాధ్యం చేసుకునేందుకు శ్రమించండి'' అని పేర్కొన్నారు. ఇక పోస్ట్ చూసిన అభిమానులు, సినీ ప్రముఖులు ఆమెకు అభినందనలు తెలుపుతున్నారు. ఆమెను ప్రశంసిస్తూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. 'మీరు ఎప్పటికీ విశ్వసుందరే', 'మీరు ఎంతోమందికి ఆదర్శం' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం సుస్మిత షేర్ చేసిన ఫొటోలు మాత్రం ఇంటర్నెట్‌లో తెగ షేర్ అవుతున్నాయి.



హరి హర వీర మల్లు ప్రెస్ మీట్‌లో మెరిసిన నిధి అగర్వాల్

# 23న మాయాబజార్ రీ రిలీజ్






విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు, మహానటి సావిత్రి, అక్కినేని నాగేశ్వరరావు లాంటి దిగ్గజాలు నటించిన సినిమా మాయాబజార్. 1957లో వచ్చిన ఈ సినిమా అప్పట్లో ఓ ప్రభంజనం. తెలుగు వారు ఇష్టపడే క్లాసిక్ చిత్రాల వరుసలో 'మాయాబజార్' ఎప్పటికీ ముందు స్థానంలో ఉంటుంది. తరాలు గడుస్తున్నా ఈ సినిమాపై వారికి ఉన్న ఆదరాభిమానాలు మాత్రం తగ్గలేదు సరికదా రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇటీవల రీరిలీజ్‌ల ట్రెండ్ ఊపందుకున్న తరుణంలో ఈ చిత్రాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఈ నెల 28న ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా కలర్ వెర్షన్‌లో బలుసు రామారావు విడుదల చేస్తున్నారు.

# ఐపీఎల్‌కు మహేంద్ర సింగ్ ధోనీ రిటైర్మెంట్ అప్పుడే!

కొన్నేళ్లుగా ఐపీఎల్ సీజన్ ప్రారంభమైన ప్రతిసారీ ధోనీ రిటైర్మెంట్‌పై వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా గత సీజన్‌లో ధోనీ మోకాలి సమస్యతో ఇబ్బంది పడ్డాడు. శస్త్రచికిత్స తర్వాత కోలుకుని తిరిగి ఈ సీజన్ ఆడుతున్నాడు. అయిదుసార్లు ఐపీఎల్ టోర్నీ విజేతగా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు, ఈ సీజన్‌లో పేలవ ప్రదర్శనతో తేలిపోతోంది. వరుసగా రెండు సీజన్లలో ప్లేఆఫ్స్‌నకు చేరుకోకపోవడం చెన్నైకి ఇదే ప్రథమం. మొత్తంగా వారి 16 ఏళ్ల చరిత్రలో వారు ప్లేఆఫ్స్‌నకు దూరమవడం ఇది మూడోసారి మాత్రమే. ప్రస్తుత సీజన్‌లో చెన్నై ఇప్పటి వరకు 13 మ్యాచ్‌లు ఆడితే అందులో కేవలం మూడింట్లో మాత్రమే విజయం సాధించింది. 10 మ్యాచుల్లో పరాజయం పాలైంది. దీంతో 6 పాయింట్లతో పట్టికలో పదోస్థానానికి పరిమితమైంది. తాజాగా మే 20న దిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానం వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. మే 25న అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ తలపడనుంది. ఈ సీజన్‌లో చెన్నైకు ఇదే ఆఖరి మ్యాచ్ కానుంది. ఈ నేపథ్యంలో ధోనీ రిటైర్మెంట్‌పై పలువురు విమర్శలు చేస్తున్నారు.

**విశ్రాంతికి వేళైంది: జోగిందర్ శర్మ**

మహేంద్ర సింగ్ ఫిట్‌నెస్ స్థాయిని పరిగణనలోకి తీసుకుంటే, అతను దాన్ని నిరూపించుకోవడానికి ఆడాలి. కానీ ఇప్పుడు ధోనీ విశ్రాంతి తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని నమ్ముతున్నాను.

* **నేనే ధోనీనైతే ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించి ఉండేవాణ్ని: సంజయ్ బంగర్**

నేనే ధోనీనైతే ఈ పాటికే ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించి ఉండేవాణ్ని. జట్టులో మార్పు అనేది ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది కాబట్టి రిటైర్‌మెంట్ తీసుకోవడానికి సరైన సమయం అంటూ ఏదీ ఉండదు. తాను నిష్క్రమించినా ఫ్రాంఛైజీ అభివృద్ధి అదే జరుగుతుందన్న వాస్తవాన్ని అతను ఇప్పటికైనా గ్రహించాలి.

* **ధోనీనే నిర్ణయం తీసుకోవాలి: కృష్ణమాచారి శ్రీకాంత్**

ఐపీఎల్‌లో కొనసాగాలా.. లేదా రిటైర్మెంట్ తీసుకోవాలా... అనే నిర్ణయం తన శారీరక స్థితి ఆధారంగా అతనే తీసుకోవాలి. కానీ ఈ వయసులోనూ కొనసాగడం మాత్రం అంత తేలికైన విషయం కాదు. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి ఎంతో కసరత్తు చేయాల్సి ఉంటుంది.

* **ఏ విషయమో నా శరీరమే చెబుతుంది: మహేంద్ర సింగ్ ధోనీ**

నేను వచ్చే ఐపీఎల్ సీజన్‌లో ఆడాలా.. లేదా.. అనే విషయం నా శరీరమే నాకు చెబుతుంది. దాని ఆధారంగానే నేను నిర్ణయం తీసుకుంటా. ప్రస్తుత ఐపీఎల్ సీజన్ ముగిసిన తర్వాత నా చేతిలో 6 నుంచి 8 నెలల సమయం ఉంటుంది. అప్పుడు నా శరీరం ఎలా స్పందిస్తుందో చూస్తా. ఒత్తిడిని తట్టుకోగలుగుతుంది అనుకుంటే కొనసాగుతా.

# ఐపీఎల్ నా జీవితాన్ని మార్చివేసింది : విప్రాజ్ నిగమ్

ఐపీఎల్ తన జీవితంలో చాలా మార్పులకు కారణమైందని దిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండర్ విప్రాజ్ నిగమ్ అంటున్నాడు. క్రికెట్ దిగ్గజాలతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం వల్ల తన ఆట మెరుగవుతోందని ఆనందం వ్యక్తం చేశాడు. విప్రాజ్‌ను దిల్లీ క్యాపిటల్స్ రూ.50లక్షలు వెచ్చించి వేలంలో దక్కించుకున్న విషయం తెలిసిందే. దీంతో అతడు ఐపీఎల్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణిస్తున్నాడు. 'ఐపీఎల్‌తో నా జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. సీనియర్ ఆటగాళ్లతో మైదానాన్ని పంచుకొని, వారి నుంచి ఆటలో మెళకువలు నేర్చుకునే అవకాశం లభిస్తోంది. దిల్లీ క్యాపిటల్స్ నన్ను ఎంపిక చేసినప్పుడు.. నా కోచ్‌లు, యాజమాన్యంతో చర్చించాను. లీగ్, దేశవాళీ క్రికెట్‌లో వారు నా బ్యాటింగ్‌ను చూశారు. నేను ఆల్ రౌండర్ పాత్ర పోషించాలని వారు ఎప్పుడూ నాకు చెబుతుండేవారు. అందుకే బ్యాటింగ్, బౌలింగ్.. రెండింటికీ సమ ప్రాధాన్యం ఇస్తున్నా' అని విప్రాజ్ అన్నాడు. నేషనల్ క్రికెట్ అకాడమీకి వెళ్లి వచ్చిన తర్వాత తన ఆటలో వచ్చిన మార్పుల గురించి వివరించాడు. 'నేను ఎన్‌సీఏకు వెళ్లిన తర్వాత ముగ్గురు కోచ్‌లు నా ప్రగతికి కారణమయ్యారు. నేను నిజానికి బ్యాటర్‌గా వెళ్లాను. కానీ అక్కడ బ్యాటింగ్, బౌలింగ్ రెండూ ప్రాక్టీస్ చేశా. ఒక లెగ్ స్పిన్నర్‌గా బౌలింగ్‌ను సీరియస్‌గా తీసుకోమని వారు నాకు సూచించారు. నేను మొదట్లో పార్ట్‌టైమ్ బౌలర్‌గా కొన్ని ఓవర్లు బౌలింగ్ చేసేవాణ్ని. కానీ ఎన్‌సీఏకు వెళ్లిన తర్వాత నా ఆలోచన ధోరణి పూర్తిగా మారింది' అని విప్రాజ్ నిగమ్ చెప్పుకొచ్చాడు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.